తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | శుక్రవారం - 21- ఆగస్టు 2026 | సంపుటి : 4 | సంచిక : 78 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in

# మణిపూర్‌లో మళ్లీ చెలరేగిన నిరసనలు

- జనగణనకు ముందు పౌర పట్టిక నవీకరణ డిమాండ్
- రెండు రోజుల సార్వత్రిక సమ్మెకు పిలుపు
- పలు జిల్లాల్లో రహదారుల దిగ్బంధనం
- మూడు రోజుల పాటు విద్యాసంస్థల మూసివేత

**ఇంఫాల్, ఆగస్టు 20 (తెలంగాణ ముచ్చట్లు):**

బీజేపీ పాలిత మణిపూర్‌లో మరోసారి నిరసనల జ్వాలలు రగిలాయి. రాష్ట్రంలో జనాభా గణన చేపట్టే ముందు జాతీయ పౌర పట్టికను నవీకరించాలని వివిధ సామాజిక సంస్థలు డిమాండ్ చేస్తుండటంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అంతర్గతంగా స్థానభ్రంశం చెందిన ప్రజలు తమ స్వస్థలాలకు తిరిగి చేరే వరకు జనగణన నిర్వహించకూడదని ఆందోళనకారులు పట్టుబడుతున్నారు. ఈ డిమాండ్ల సాధన కోసం న్యాయమైన, నిష్పక్షపాత పునర్విభజన ప్రచార సంస్థ ఆధ్వర్యంలో ఉద్యమం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో 48 గంటల సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చిన ఉద్యమకారులు మణిపూర్ లోయ ప్రాంతంలోని పలు జిల్లాల్లో

మిగతా 2లో







# దక్షిణ మండలి సమావేశానికి భట్టి హాజరు

మహాబలిపురంలో 31వ సమావేశం నిర్వహణ
అమిత్ షా అధ్యక్షతన కీలక భేటీ
దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధిపై చర్చ
సమన్వయ సహకారానికి తెలంగాణ మద్దతు

**మహాబలిపురం, ఆగస్టు 20 (తెలంగాణ ముచ్చట్లు):**
తమిళనాడులోని మహాబలిపురంలో నిర్వహించిన 31వ దక్షిణ మండలి సమావేశానికి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరయ్యారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో దక్షిణాది రాష్ట్రాలకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చ జరిగింది. ప్రాంతీయ అభివృద్ధి, రాష్ట్రాల మధ్య సమన్వయం, ఉమ్మడి ప్రయోజనాల అంశాలు ప్రధానంగా సమావేశంలో ప్రస్తావనకు వచ్చాయి. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు, మంత్రులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయడం, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం వంటి అంశాలపై చర్చించారు.

మిగతా 2లో

# పాలిటెక్నిక్‌ల బలోపేతమే లక్ష్యం

- విద్యార్థులు, ఉద్యోగుల హక్కులకు పూర్తి రక్షణ
- డిప్లొమా, పరీక్షల విధానంలో మార్పులుండవు
- పరిశ్రమల అనుసంధానంతో ఉపాధి అవకాశాల విస్తరణ
- మంత్రి వివేక్ వెంకటస్వామి

2లో






# మక్తల్ అభివృద్ధికి రూ.273 కోట్ల పనులు

**మంత్రి శ్రీహరి 25 ఏళ్ల ప్రజా ప్రస్థానం పూర్తి**
**సీతక్క చేతుల మీదుగా ఘన సన్మానం**
**మక్తల్‌కు భారీగా సంక్షేమ, మౌలిక వసతులు**

**మక్తల్, ఆగస్టు 20 (తెలంగాణ ముచ్చట్లు):**
ప్రజా జీవితంలో 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్య, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని రాష్ట్ర మంత్రి సీతక్క ఘనంగా సన్మానించారు. గురువారం మక్తల్ పట్టణంలోని ద్వారక ఫంక్షన్ హాల్‌లో

మిగతా 2లో

# ఫీజు బకాయిల విడుదలకు బీజేపీ మహాధర్నా



- విద్యార్థుల సమస్యలపై ఆందోళన
- ప్రభుత్వంపై రాంచందర్‌రావు విమర్శలు
- కరీంనగర్‌లో భారీగా పాల్గొన్న విద్యార్థులు

**కరీంనగర్, ఆగస్టు 20 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్‌లో భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో

# రైల్వే మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్రం కట్టుబాటు

- పార్లమెంట్ సభ్యుల సమావేశంలో కీలక చర్చలు
- స్టేషన్ల ఆధునీకరణ, వంతెనల నిర్మాణంపై దృష్టి
- ప్రజల భద్రతకు ప్రత్యేక చర్యల సూచన
- ఎంఎంటీఎస్ విస్తరణకు ప్రతిపాదనలు

**హైదరాబాద్, ఆగస్టు 20 (తెలంగాణ ముచ్చట్లు):**
దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని పార్లమెంట్ సభ్యుల వార్షిక సమావేశం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో గురువారం జరిగింది. ఈ సమావేశంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు

మిగతా 2లో



# మెడిపల్లిలో కల్తీ మసాలాల గుట్టురట్టు

- ప్రజారోగ్యంతో చెలగాటమాడిన అక్రమ వ్యాపారం
- పోలీస్ కమిషనర్ బి. సుమతి పర్యవేక్షణలో దాడులు
- రూ.25 లక్షల విలువైన సరుకు స్వాధీనం
- కల్తీ వ్యాపారులపై కఠిన చర్యల హెచ్చరిక

**మల్కాజిగిరి, ఆగస్టు 20 (తెలంగాణ ముచ్చట్లు):**
ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే కల్తీ ఆహార పదార్థాల తయారీ కేంద్రంపై మల్కాజిగిరి పోలీసులు మెరుపుదాడులు నిర్వహించి భారీ స్థాయిలో మసాలా పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. మెడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కాలనీలో ఉన్న సాయి తిరుమల ఎంటర్‌ప్రైజెస్‌లో అపరిశుభ్ర పరిస్థితుల్లో కల్తీ మసాలా పొడులను తయారు చేస్తున్నట్లు గుర్తించారు.

మిగతా 7లో




# లంచం తీసుకుంటూ ఏసీబీకి ఎస్సై పట్టుబాటు

- స్టేషన్ బెయిల్ కోసం రూ.30 వేలు డిమాండ్
- రాజంపేట ఎస్సైపై అవినీతి కేసు నమోదు
- ఇంట్లోనే లంచం తీసుకుంటూ పట్టుబాటు

**కామారెడ్డి, ఆగస్టు 20 (తెలంగాణ ముచ్చట్లు):**
స్టేషన్ బెయిల్ మంజూరు చేయడంతో పాటు చార్జిషీట్‌లో తక్కువ శిక్ష పడే సెక్షన్లు నమోదు చేస్తానంటూ లంచం డిమాండ్ చేసిన ఎస్సై ఏసీబీ అధికారులకు చిక్కాడు. కామారెడ్డి జిల్లా రాజంపేట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై దువ్వాల ఆంజనేయులు రూ.30 వేల లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సమాచారం ప్రకారం ఒక కేసులో నిందితుడిగా ఉన్న తన కుమారుడికి స్టేషన్ బెయిల్ మంజూరు చేయాలని బాధితుడు ఎస్సైను సంప్రదించాడు. అలాగే కేసులో తక్కువ శిక్ష పడే విధంగా సెక్షన్లు నమోదు చేయాలని కోరాడు.

మిగతా 7లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# మణిపూర్‌లో మళ్లీ చెలరేగిన నిరసనలు

(మొదటి పేజీ తరువాయి)

భారీ నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఇంఫాల్ వెస్ట్, ఇంఫాల్ ఈస్ట్, బిష్ణుపూర్, తౌబల్ జిల్లాల్లో అనేక ప్రాంతాల్లో రహదారులను దిగ్బంధించి రాకపోకలకు అంతరాయం కలిగించారు. దీంతో సాధారణ ప్రజల జీవనం తీవ్రంగా ప్రభావితమైంది.

ఇంఫాల్ తూర్పు జిల్లాలోని ఖురాయ్ లామ్‌లాంగ్ ప్రాంతంలో నిరసనకారులు రాష్ట్ర ముఖ్యమంత్రి ఖేమ్‌చంద్ సింగ్, హోం శాఖ మంత్రి గోవిందాస్ కొంతౌజమ్‌ల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ప్రభుత్వ విధానాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఆందోళనకారులు తమ డిమాండ్లు నెరవేరే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలను కూడా బహిష్కరించాలని ఉద్యమకారులు నిర్ణయించారు. గురువారం నుంచి అన్ని ప్రభుత్వ కార్యాలయాల కార్యకలాపాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. దీంతో ప్రభుత్వ యంత్రాంగంపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని శాంతిభద్రతల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆగస్టు 20 నుంచి 22 వరకు రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థలను మూసివేస్తున్నట్లు ప్రకటించింది. విద్యార్థుల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. అదేవిధంగా తౌబల్ జిల్లాలో నిర్వహించాల్సిన జనగణన శిక్షణా కార్యక్రమాన్ని కూడా రద్దు చేసినట్లు



అధికారులు తెలిపారు. నిరసనలు మరింత ఉధృతమయ్యే అవకాశాల నేపథ్యంలో ప్రభుత్వం పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తోంది. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు అప్రమత్తంగా వ్యవహరిస్తామని అధికారులు పేర్కొన్నారు.

# దక్షిణ మండలి సమావేశానికి భట్టి హాజరు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ తరఫున సమావేశానికి హాజరైన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై అభిప్రాయాలను పంచుకున్నారు. అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, పరిపాలనా సమన్వయం వంటి విషయాలపై దక్షిణాది రాష్ట్రాల మధ్య మరింత సహకారం అవసరమని పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాలు దేశ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని, పరస్పర సమన్వయంతో అనేక సమస్యలకు పరిష్కారాలు కనుగొనవచ్చని సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కేంద్రం, రాష్ట్రాల మధ్య సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలనే అంశంపై కూడా చర్చ జరిగింది.

ఈ సందర్భంగా భట్టి విక్రమార్క ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు, మంత్రులు, అధికారులతో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. రాష్ట్రాల మధ్య అనుభవాల మార్పిడి, ఉత్తమ విధానాల అమలు వంటి అంశాలు కూడా సమావేశంలో ప్రాధాన్యత పొందాయి. దక్షిణాది రాష్ట్రాల మధ్య సహకారం, సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి దేశాభివృద్ధికి తోడ్పడాలనే సంకల్పంతో ఈ సమావేశం కొనసాగింది. దక్షిణ మండలి వేదిక రాష్ట్రాల ఉమ్మడి ప్రయోజనాల సాధనకు కీలకంగా నిలుస్తోందని సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు అభిప్రాయపడ్డారు.



# మక్తల్ అభివృద్ధికి రూ.273 కోట్ల పనులు

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి శ్రీహరికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఇదే సందర్భంగా మక్తల్ నియోజకవర్గంలో సుమారు రూ.273 కోట్ల విలువైన 25 అభివృద్ధి పనులకు మంత్రులు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. రహదారులు, ఆసుపత్రులు, క్రీడా మైదానాలు, విద్యాసంస్థలు, సాగునీరు, విద్యుత్, గ్రామీణ మౌలిక వసతులకు సంబంధించిన పనులకు శ్రీకారం చుట్టారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ 2001 ఆగస్టు 20న తన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైందని, ప్రజల ఆశీర్వాదం, కార్యకర్తల అండదండలతో 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని పూర్తి చేసుకున్నానని తెలిపారు. మక్తల్ అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు కేటాయిస్తున్న ప్రభుత్వానికి, తన ఆహ్వానాన్ని స్వీకరించి కార్యక్రమానికి హాజరైన మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు. మక్తల్ చాలా కాలం వెనుకబడిన ప్రాంతంగా మిగిలిపోయిందని, ప్రస్తుతం కొడంగల్‌కు సమానంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే దిశగా అడుగులు పడుతున్నాయని పేర్కొన్నారు. రాబోయే రెండున్నరేళ్లలో ప్రతి గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు వెల్లడించారు.

ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మక్తల్ నియోజకవర్గంలోని రైతులు, మహిళలు, పేదలు, విద్యార్థులు, కార్మికులు, వెనుకబడిన వర్గాల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు శ్రీహరి వివరించారు. రైతు రుణమాఫీ కింద 33,788 మంది రైతులకు రూ.363 కోట్లు, రైతు భరోసా కింద 92,949 మంది రైతులకు రూ.153.52 కోట్లు అందించినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా రెండు దశల్లో 5,500 ఇళ్లకు రూ.275 కోట్ల మేర ప్రయోజనం కల్పిస్తున్నామని, 3,942 కుటుంబాలకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా రూ.39.46 కోట్ల సాయం అందించినట్లు చెప్పారు. గృహజ్యోతి, ఉచిత బస్సు ప్రయాణం, మహాలక్ష్మి గ్యాస్ పథకం, కొత్త రేషన్ కార్డులు, సన్నవడ్ల కొనుగోలు, బోనస్ వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి కూడా పెద్దఎత్తున నిధులు కేటాయించామని మంత్రి తెలిపారు. 49 గ్రామ పంచాయతీ భవనాలకు రూ.9.80 కోట్లు, 24 అంగన్‌వాడీ భవనాలకు రూ.2.88 కోట్లు, 72 మహిళా సంఘ భవనాలకు రూ.7.20 కోట్లు కేటాయించినట్లు వివరించారు. విద్యుత్ మౌలిక వసతుల బలోపేతంలో భాగంగా 33 కేవీ సబ్‌స్టేషన్లు, 132 కేవీ, 220 కేవీ వ్యవస్థల అభివృద్ధి చేపడుతున్నట్లు తెలిపారు. ఆత్మకూరు, అమరచింత, ఉట్కూర్, నర్వ, కృష్ణ, మాగనూర్, మక్తల్ మండలాల్లో ఆసుపత్రులు, రహదారులు, క్రీడా మైదానాలు, విద్యాసంస్థలు, లిఫ్ట్ ఇరిగేషన్, వంతెనలు, గోదాములు, పట్టణ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. మక్తల్‌లో 150 పడకల ఆసుపత్రి, డయాలసిస్ కేంద్రం, అగ్నిమాపక కేంద్రం, సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయం, డిగ్రీ కళాశాల, ఇంటిగ్రేటెడ్ పాఠశాల వంటి కీలక ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని తెలిపారు.

మంత్రి సీతక్క మాట్లాడుతూ వాకిటి శ్రీహరి 25 ఏళ్లుగా ప్రజల కోసం కష్టపడుతూ ఈ స్థాయికి ఎదిగారని, ఆయన రాజకీయ ప్రస్థానం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. మక్తల్ అభివృద్ధికి సుమారు రూ.1,800 కోట్ల మేర నిధులు తీసుకురావడానికి శ్రీహరి కృషి చేశారని పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ జయంతి రోజునే ఆయన రాజకీయ ప్రస్థానం ప్రారంభం కావడం విశేషమని, గ్రామ పంచాయతీల బలోపేతానికి రాజీవ్ గాంధీ చేసిన కృషిని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం వెనుకబడిన నియోజకవర్గాలకు ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. మక్తల్ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని చెప్పారు. మక్తల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని సీతక్క పిలుపునిచ్చారు. శ్రీహరి తన రాజకీయ జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేశారని, జన్మనిచ్చిన గడ్డకు రుణం తీర్చుకోవాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారని కొనియాడారు. ప్రతిపక్షాలు చిల్లర రాజకీయాలు మానుకోవాలని, సామాజిక మాధ్యమాల్లో వచ్చే అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్‌ల బలోపేతమే లక్ష్యం

**హైదరాబాద్, ఆగస్టు 20 (తెలంగాణ ముచ్చట్లు):** పాలిటెక్నిక్ విద్యను మరింత బలోపేతం చేయడం, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణను తీర్చిదిద్దడం, విద్యార్థులకు ఉపాధి అవకాశాలను విస్తరించడమే లక్ష్యంగా పాలిటెక్నిక్ కళాశాలలను ఉపాధి, శిక్షణ కమిషనరేట్ పరిధిలోకి తీసుకొచ్చినట్లు రాష్ట్ర శక్తి, కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాలు, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. గురువారం సచివాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, జూన్ 16న జారీ చేసిన జీవో 97 ద్వారా ఈ పరిపాలనా పునర్వ్యవస్థీకరణ చేపట్టినట్లు వివరించారు. పాలిటెక్నిక్ కళాశాలలను ఉపాధి, శిక్షణ కమిషనరేట్ పరిధిలోకి తీసుకురావడం కేవలం పరిపాలనా మార్పు మాత్రమేనని, కళాశాలల గుర్తింపు, విద్యా విధానంలో ఎలాంటి మార్పు ఉండదని మంత్రి స్పష్టం చేశారు. పాలిటెక్నిక్‌లు, పారిశ్రామిక శిక్షణ సంస్థలు, అధునాతన సాంకేతిక కేంద్రాలు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలను ఒకే వ్యవస్థలో అనుసంధానం చేయడం ద్వారా సాంకేతిక విద్య, నైపుణ్య శిక్షణ, పరిశ్రమల అవసరాల మధ్య సమన్వయం పెరుగుతుందని తెలిపారు.

ప్రస్తుతం కొనసాగుతున్న మూడేళ్ల అఖిల భారత సాంకేతిక విద్యామండలి గుర్తింపు పొందిన డిప్లొమా కోర్సుల్లో ఎలాంటి మార్పు ఉండదని వివేక్ వెంకటస్వామి తెలిపారు. విద్యార్థుల ఫీజులు, విద్యా నిర్మాణం, పరీక్షల విధానం యథావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థులు తెలంగాణ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ద్వారా ఇంజినీరింగ్ కళాశాలల్లో నేరుగా రెండో సంవత్సరంలో ప్రవేశం పొందే అవకాశం కూడా కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్ర సాంకేతిక విద్యామండలిలోని పాలిటెక్నిక్ విభాగం ఉపాధి, శిక్షణ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక విభాగంగా పనిచేస్తుందని మంత్రి వివరించారు. ప్రవేశాలు, పరీక్షలు, డిప్లొమా విద్యకు సంబంధించిన విద్యా వ్యవహారాలను ఇదే విభాగం నిర్వహిస్తుందని తెలిపారు. పాలిటెక్నిక్ ఉద్యోగుల హక్కులకు పూర్తి రక్షణ ఉంటుందని, ప్రస్తుత పోస్టులు, కేడర్ సంఖ్య తగ్గించబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల హోదా, వేతనాలు, కరువు భత్యం, ఇంక్రిమెంట్లు, సీనియారిటీ, పదోన్నతులు, భవిష్యనిధి, పదవీ విరమణ ప్రయోజనాలు కొనసాగుతాయని తెలిపారు. పరిశ్రమలతో అనుసంధానం పెంచేందుకు ప్రభుత్వం టాటా టెక్నాలజీస్‌తో రూ.2,300 కోట్ల విలువైన పదేళ్ల భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే 65 పారిశ్రామిక శిక్షణ సంస్థలను అధునాతన సాంకేతిక కేంద్రాలుగా అభివృద్ధి చేసినట్లు చెప్పారు. 200కు పైగా పరిశ్రమలతో ఒప్పందాలు కుదిరాయని, శిక్షణ, శిక్షణానంతర ఉపాధి, పరిశ్రమల్లో అనుభవం, విద్యా ప్రణాళికల రూపకల్పన వంటి అంశాల్లో విద్యార్థులకు అవకాశాలు కల్పించనున్నట్లు వివరించారు. ప్రతి పాలిటెక్నిక్‌లో ప్రత్యేక నియామక విభాగాన్ని ఏర్పాటు చేసి ప్రాంగణ నియామకాలు, అంతర్జాతీయ ధ్రువపత్రాలు, శిక్షణ, వ్యాపార అవకాశాలు, విదేశీ ఉపాధి అవకాశాలను పెంచుతామని తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలకు సంబంధించిన భూములు, భవనాలు, ఇతర ఆస్తులు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి బదిలీ చేయబోమని, అవి ఉపాధి, శిక్షణ కమిషనరేట్ పరిధిలోనే ఉంటాయని మంత్రి స్పష్టం చేశారు.

# సామాన్యుడిలా బైక్‌పై సీపీ పరిశీలన

**హైదరాబాద్, ఆగస్టు 20 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ నగరంలో కేబీఆర్ పార్కు పరిసర ప్రాంతాల్లో ఇటీవల అమల్లోకి తీసుకొచ్చిన వన్‌వే ట్రాఫిక్ విధానం ప్రభావాన్ని ప్రత్యక్షంగా అంచనా వేయడానికి నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ గురువారం ప్రత్యేకంగా క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఎలాంటి అధికారిక హడావుడి లేకుండా సాధారణ పౌరుడిలా సివిల్ దుస్తుల్లో బైక్‌పై ప్రయాణిస్తూ ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలించడం విశేషంగా నిలిచింది. నగరంలోని కీలక రహదారులపై వాహనాల కదలికలు, ట్రాఫిక్ ప్రవాహం, వన్‌వే అమలు ఫలితాలను స్వయంగా గమనించారు. రోడ్ నంబర్ 45 నుంచి జూబ్లీ చెక్‌పోస్ట్, వెంకటగిరి, కేబీఆర్ పార్క్ ప్రధాన ద్వారం, ముగ్ధ జంక్షన్, బసవతారకం, అగ్రసేన్ చౌరస్తా, ఫిల్మ్‌నగర్ జంక్షన్ మార్గాల మీదుగా సీపీ రెండు సార్లు బైక్‌పై ప్ర



యాణించారు. ఈ మార్గాల్లో వాహనాల రాకపోకలు ఎలా సాగుతున్నాయి, ఎక్కడైనా ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయా, కొత్త విధానం వల్ల ప్రజలకు ఎలాంటి మార్పులు కనిపిస్తున్నాయన్న అంశాలను ఆయన నిశితంగా పరిశీలించారు. ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులు తీసుకుంటున్న చర్యలపై కూడా సమీక్ష నిర్వహించారు.

# ఫీజు బకాయిల విడుదలకు బీజేపీ మహాధర్నా

(మొదటి పేజీ తరువాయి)

"ఫీజు బకాయి - బీజేపీ లడాయి" పేరుతో మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు పాల్గొని విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వ దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేశారు. మహాధర్నాలో పాల్గొన్న విద్యార్థులు, యువకులు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలలో జరుగుతున్న జాప్యంపై ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ నినాదాలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు ఫీజుల సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

సభను ఉద్దేశించి మాట్లాడిన ఎన్. రాంచందర్‌రావు గత ప్రభుత్వ కాలం నుంచి వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయని అన్నారు. ప్రస్తుతం కూడా విద్యార్థులకు సంబంధించిన నిధులు విడుదల కాకపోవడంతో వారి చదువులు, భవిష్యత్తు అనిశ్చితిలో పడుతున్నాయని విమర్శించారు. పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దాదాపు 20 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కాలేజీలకు నిధులు అందకపోవడంతో అధ్యాపకులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని, కొన్ని విద్యాసంస్థలు ఆర్థిక ఇబ్బందులతో కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు.

ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ నాయకులు ఆరోపించారు. విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన అంశాలను రాజకీయాలకు అతీతంగా చూడాలని, పెండింగ్ నిధుల విడుదలకు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ఈ మహాధర్నాలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాంతికుమార్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుందే, జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్‌రావు, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పూర్తిగా విడుదలయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని బీజేపీ నాయకులు ప్రకటించారు.

# రైల్వే మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్రం కట్టుబాటు

(మొదటి పేజీ తరువాయి)

ఈటల రాజేందర్‌తో పాటు లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు మరియు దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రైల్వే మౌలిక వసతుల అభివృద్ధి, ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదల, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల పురోగతిపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న రైల్వే అభివృద్ధి పనులపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. రైల్వే స్టేషన్ల ఆధునీకరణ, కొత్త మౌలిక వసతుల కల్పన, ప్రజల అవసరాలకు అనుగుణంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, రైల్వే అండర్ బ్రిడ్జిలు, ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం వంటి అంశాలను సభ్యులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పూర్తికావాల్సిన పనులను వేగవంతం చేయాలని కోరారు.

ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ గతంలో రైల్వే ప్రాజెక్టులకు కేంద్రం, రాష్ట్రం ఉమ్మడిగా నిధులు సమకూర్చేవని, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో నిధులు కేటాయిస్తూ రైల్వే అభివృద్ధిని వేగవంతం చేస్తోందని తెలిపారు. రైల్వే స్టేషన్లు, ఆర్‌యూబీలు, ఆర్‌ఓబీలు, ఎంఎంటీఎస్ ప్రాజెక్టులతో పాటు అవసరమైన భూసేకరణను కూడా రైల్వే శాఖే చేపడుతోందని వివరించారు. రైల్వే ప్రమాదాల నివారణకు మరిన్ని భద్రతా చర్యలు అవసరమని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రజలు తరచుగా పట్టాలు దాటే ప్రాంతాల్లో ఎక్కువ సంఖ్యలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, అండర్ బ్రిడ్జిలు నిర్మించాలని సూచించారు. ఫతేనగర్ వంటి ప్రాంతాల్లో రోజూ వేలాది మంది రైల్వే పట్టాలు దాటుతున్న నేపథ్యంలో అక్కడ అత్యవసరంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. ప్రజల ప్రాణ రక్షణకు ఇది అత్యంత అవసరమని తెలిపారు.

మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో ప్రస్తుతం 24 ఆర్‌యూబీ, ఆర్‌ఓబీ పనులు కొనసాగుతున్నాయని ఈటల రాజేందర్ తెలిపారు. మేడ్చల్ రైల్వే స్టేషన్‌ను రూ.25 కోట్లతో, మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌ను రూ.26



కోట్లతో ఆధునీకరిస్తున్నట్లు చెప్పారు. అదనంగా కొన్ని ప్రత్యేక రైళ్లు మంజూరు చేయాలని రైల్వే శాఖను కోరినట్లు వెల్లడించారు. అండర్ బ్రిడ్జిల వద్ద నీరు నిలిచిపోవడం వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగర విస్తరణకు అనుగుణంగా ఎంఎంటీఎస్ సేవలను మరింత పెంచాల్సిన అవసరం ఉందని సమావేశంలో అభిప్రాయపడ్డారు. యాదగిరిగుట్ట వరకు ఎంఎంటీఎస్ విస్తరణకు కేంద్ర నిధులతో ప్రణాళిక రూపొందుతున్నట్లు తెలిపారు. ఆనంద్‌బాగ్, అల్వాల్, వెంకటాపురం ప్రాంతాల్లో కొత్త రైల్వే స్టేషన్ల నిర్మాణ ప్రతిపాదనలను కూడా సమావేశంలో ప్రస్తావించారు. రైల్వే అభివృద్ధి పనుల అమలుకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా సమన్వయంతో ముందుకు రావాలని సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు సూచించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఘన నివాళులు



- **ములకనూరు అంబేద్కర్ చౌరస్తాలో చిత్రపటానికి నివాళులు అర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్**

**భీమదేవరపల్లి, ఆగస్టు 20(తెలంగాణ ముచ్చట్లు):** భారత మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా హుస్నాబాద్ నియోజకవర్గం భీమదేవరపల్లి మండలం ములకనూరు అంబేద్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన జయంతి వేడుకల్లో కేక్ కట్ చేసి రాజీవ్ గాంధీ సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని విశ్వసించిన రాజీవ్ గాంధీ యువతకు ఎన్నో అవకాశాలు కల్పించారని అన్నారు. 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించి ప్రజాస్వామ్య నిర్మాణంలో యువతకు కీలక పాత్ర కల్పించిన గొప్ప నాయకుడని కొనియాడారు.
భారతదేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకెళ్లాలనే దూరదృష్టితో సాంకేతిక, సమాచార సాంకేతిక, టెలికమ్యూనికేషన్ రంగాల్లో విప్లవాత్మక మార్పులకు రాజీవ్ గాంధీ శ్రీకారం చుట్టారని తెలిపారు. గ్రామీణ భారత అభివృద్ధికి కూడా ఆయన ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు.
పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు గ్రామ పంచాయతీలకు అధికారాలు, నిధులు పెంచేందుకు ఆయన ప్రభుత్వం చేసిన కృషి స్థానిక సంస్థలకు ప్రజాస్వామ్య బలాన్ని చేకూర్చిందన్నారు. గ్రామీణాభివృద్ధి, యువతకు అవకాశాలు, సాంకేతిక పురోగతి, బలమైన ప్రజాస్వామ్యం కోసం రాజీవ్ గాంధీ చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు.
రాజీవ్ గాంధీ ఆలోచనలు, ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య పరిరక్షణ, యువత భవిష్యత్తు, గ్రామీణాభివృద్ధి కోసం ప్రజల పక్షాన నిరంతరం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే రాజీవ్ గాంధీకి అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌పై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం



- **కొమ్ము వెంకటస్వామి పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు**

**పెద్దమందడి,ఆగస్టు20(తెలంగాణ ముచ్చట్లు):** కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై టీఆర్ఎస్ పార్టీ ధర్నాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని వనపర్తి జిల్లా పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్ము వెంకటస్వామి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాలను ఉద్దేశపూర్వకంగా నిలిపివేయలేదని, న్యాయపరమైన కారణాలతో ఏర్పడిన తాత్కాలిక పరిస్థితిని అడ్డుపెట్టుకుని టీఆర్ఎస్ నాయకులు రాజకీయ లబ్ధి కోసం ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని అన్నారు.గురువారం పెద్దమందడి మండల కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలుపై బీఆర్ఎస్ పార్టీ ధర్నాలు నిర్వహిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తోందన్నారు. ప్రభుత్వం న్యాయపరమైన ప్రక్రియను పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారులకు పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటుందని తెలిపారు.ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారాన్ని బీఆర్ఎస్ నాయకులు మానుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు. పేదలు, రైతులు, మహిళల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.పెద్దమందడి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. పథకాల విషయంలో బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న ఆందోళనలు రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నవని విమర్శించారు. ప్రజలకు వాస్తవాలను వివరించకుండా ధర్నాల పేరుతో గందరగోళం సృష్టించడం సరికాదన్నారు. ప్రభుత్వం త్వరలోనే న్యాయపరమైన అంశాలను పరిష్కరించి పథకాలను కొనసాగించేలా చర్యలు తీసుకుంటుందని తెలిపారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడా ప్రతిభను వెలికితీస్తా.. ఎం. ధనలక్ష్మి

**ఎల్కతుర్తి ఆగస్టు 20 తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండలంలోని విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు కృషి చేస్తానని నూతన ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఎం. ధనలక్ష్మి అన్నారు. 2026-27 విద్యా సంవత్సరానికి ఎల్కతుర్తి మండల ఎస్‌జీఎఫ్ సెక్రటరీగా ఆమె ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జడ్పీహెచ్ఎస్ బావుపేట్ పాఠశాలలో ఎంఈఓ చదువుల సత్యనారాయణ ఆదేశాల మేరకు హెచ్ఎం ఎల్. మనోహర్ నాయక్ అధ్యక్షతన పీడీలు, పీఈటీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్పూర్ జడ్పీహెచ్ఎస్ పీడీ ఎం. ధనలక్ష్మిని ఎస్‌జీఎఫ్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడల్లో మెరుగైన అవకాశాలు కల్పించి, మండల స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించేలా ప్రోత్సహిస్తానన్నారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడా పోటీలను పీడీలు, పీఈటీల



సహకారంతో సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీలు, పీఈటీలు బి. సుధాకర్, టి. రాములు, జి. ప్రేమ్ ప్రసాద్ రావు, బి. స్వరూప, పి. స్వరూప, బి. కిరణ్ రావు, కె. తిరుపతి, జి. శ్రీకాంత్, ఆర్. ఉదయ్, సిహెచ్. పూర్ణిమ తదితర వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన ఎం. ధనలక్ష్మికి పలువురు అభినందనలు తెలిపారు.

# మొక్కలు నాటడం.. చెట్లు కొట్టేయడం.. ఇదేం పచ్చదనం?







- **కరెంట్ వైర్ల కింద భారీ వృక్షాలు.. పెరిగాక నరికివేత.. అధికారుల తీరుపై ప్రజల విస్మయం**

**ఎల్కతుర్తి, ఆగస్టు 20 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండలంలో పచ్చదనం పెంపు పేరుతో మొక్కలు నాటడం, అవి పెరిగిన తర్వాత విద్యుత్ వైర్లకు అడ్డుగా వస్తున్నాయంటూ చెట్లను నరికివేయడం ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. పచ్చదనం పెంచేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున మొక్కలు నాటుతుంటే, వాటిని నాటే ప్రదేశాల ఎంపికలో సరైన ప్రణాళిక లేకపోవడంతో చివరకు చెట్లను కొట్టేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ప్రజలు విమర్శిస్తున్నారు.
మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, వైర్లకు సమీపంలోనే భారీగా పెరిగే మొక్కలను నాటుతున్నారు. కొంతకాలానికి అవి ఏపుగా పెరిగి విద్యుత్ వైర్లకు తగిలే పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా విద్యుత్ శాఖ సిబ్బంది చెట్ల కొమ్మలను తొలగించడం, కొన్ని సందర్భాల్లో చెట్లను పూర్తిగా నరికివేయడం జరుగుతోందని గ్రామస్తులు చెబుతున్నారు.

**నాటే ముందు ఆలోచనేది?**

మొక్కలు నాటే సమయంలోనే విద్యుత్ లైన్లు, రహదారులు, భవిష్యత్తులో చెట్లు పెరిగే స్థలాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు. ఎక్కడ పడితే అక్కడ భారీ వృక్షాలను నాటడం వల్ల పచ్చదనం పెరగకపోగా, నాటిన మొక్కలే చివరకు నరికివేతకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పూల మొక్కలు నాటితే మేలు**

విద్యుత్ వైర్ల కింద భారీ వృక్షాలకు బదులుగా తక్కువ ఎత్తులో పెరిగే పూల మొక్కలు, అలంకార మొక్కలను రహదారులకు ఇరువైపులా అనువైన ప్రదేశాల్లో నాటితే పచ్చదనంతో పాటు అందం కూడా పెరుగుతుందని ప్రజలు సూచిస్తున్నారు. విద్యుత్ లైన్లకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మొక్కల ఎంపిక ఉండాలని కోరుతున్నారు.

**ప్రజాధనం.. శ్రమ వృథా?**

ఒకవైపు మొక్కలు నాటేందుకు ప్రభుత్వం నిధులు ఖర్చు చేస్తుండగా, మరోవైపు అవే మొక్కలు పెరిగిన తర్వాత నరికివేయడం వల్ల ప్రజాధనం, సిబ్బంది శ్రమ వృథా అవుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించి వృక్షాలుగా పెంచడమే పచ్చదనం కార్యక్రమం అసలు లక్ష్యమని గుర్తు చేస్తున్నారు.
ఇప్పటికైనా సంబంధిత అధికారులు విద్యుత్ శాఖతో సమన్వయం చేసుకుని మొక్కలు నాటే ప్రాంతాలను ముందుగానే గుర్తించాలని ప్రజలు కోరుతున్నారు. విద్యుత్ వైర్లకు అడ్డుగా రాని మొక్కలను ఎంపిక చేసి శాస్త్రీయ పద్ధతిలో నాటడంతో పాటు, ఇప్పటికే నాటిన మొక్కలను అనవసరంగా నరికివేయకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

# రాజీవ్ గాంధీ ఆశయాలే కాంగ్రెస్ మార్గదర్శకం

- **కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొమ్ము వెంకటస్వామి**




**పెద్దమందడి,ఆగస్టు20(తెలంగాణ ముచ్చట్లు):** మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను వనపర్తి జిల్లా పెద్దమందడి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ము వెంకటస్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా జన్మదిన వేడుకలను జరుపుకున్నారు.అనంతరం కొమ్ము వెంకటస్వామి మాట్లాడుతూ.. దేశాన్ని అభివృద్ధి, ఆధునికత వైపు నడిపించడంలో రాజీవ్ గాంధీ కీలక పాత్ర పోషించారని అన్నారు. యువతకు ప్రాధాన్యత కల్పిస్తూ దేశ భవిష్యత్తు కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలు, ఆలోచనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు.వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయని కొమ్ము వెంకటస్వామి అన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి ఎమ్మెల్యే మేఘారెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి ముందుండి పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో వనపర్తి నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజా సంక్షేమం కోసం ఐక్యంగా పనిచేయాలని కొమ్ము వెంకటస్వామి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ పేరుతో వ్యక్తిగత పోకడలు సరికాదు

**-సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి**



**ఎల్కతుర్తి ఆగస్టు 20 (తెలంగాణ ముచ్చట్లు):** పార్టీ పేరుతో వ్యక్తిగత పోకడలకు పాల్పడటం సరికాదని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అన్నారు. మర్రి వెంకటస్వామి సీపీఐ వరంగల్-కరీంనగర్ ఉమ్మడి జిల్లాల ప్రధాన కార్యదర్శిగా పేర్కొంటూ మాట్లాడటం పార్టీ నిర్మాణపరంగా సరైనది కాదని స్పష్టం చేశారు.
గురువారం ఎల్కతుర్తిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కర్రె బిక్షపతి మాట్లాడుతూ ప్రస్తుతం సీపీఐలో ఉమ్మడి జిల్లాల కార్యదర్శి పదవి లేదన్నారు. గతంలో మర్రి వెంకటస్వామి ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శిగా పనిచేశారని, ప్రస్తుతం ఆయనకు పార్టీతో ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. పార్టీ పేరుతో కుల సంఘాలు, ఇతర కార్యక్రమాల్లో పాల్గొన్న అంశాలను గతంలోనే రాష్ట్ర పార్టీ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.
మర్రి వెంకటస్వామి స్వగ్రామం బావుపేటలోని సమస్యలపై ఏదైనా అంశం ఉంటే మండల, జిల్లా పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకురావాలని సూచించారు. వ్యక్తిగతంగా కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే వాటిని పార్టీ కార్యక్రమాలుగా చిత్రీకరించడం సరికాదన్నారు. జిల్లాల పునర్విభజన అనంతరం హనుమకొండ జిల్లాతో ఆయనకు పార్టీ పరంగా ఎలాంటి సంబంధం లేదని కర్రె బిక్షపతి స్పష్టం చేశారు. సీపీఐ నాయకులు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో పార్టీ నిర్మాణ పరంగా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి శనిగరపు రాజ్‌కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఊట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, మండల సహాయ కార్యదర్శులు మర్రి విజయ్, గడ్డం రాజనర్సు, పోచన్న తదితరులు పాల్గొన్నారు.

# మాలల హక్కుల సాధనకు ఐక్య పోరాటం

- **జాతీయ మాల మహానాడు ఎల్కతుర్తి మండల అధ్యక్షులు పప్పుల గంగాధర్**

**ఎల్కతుర్తి ఆగస్టు20 (తెలంగాణ ముచ్చట్లు):** మాలల హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని జాతీయ మాల మహానాడు ఎల్కతుర్తి మండల అధ్యక్షులు పప్పుల గంగాధర్ పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 31న నిర్వహించనున్న సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.
గురువారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ ఆధ్వర్యంలో సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి మాల కుటుంబ సభ్యులు, ఉద్యోగులు, విద్యార్థులు, మేధావులు, సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ, రోస్టర్ విధానం వల్ల మాలలకు ఉద్యోగాలు, విద్యార్థులకు కళాశాల సీట్లు, ఉద్యోగులకు పదోన్నతుల విషయంలో అన్యాయం జరుగుతోందని గంగాధర్ ఆరోపించారు. మాలల హక్కులు, భవిష్యత్ తరాల ప్రయోజనాలను కాపాడేందుకు అందరూ ఐక్యతతో ఉద్యమంలో పాల్గొనాలని కోరారు.
సెక్రటేరియట్ ముట్టడి ద్వారా ప్రభుత్వానికి తమ డిమాండ్లను బలంగా తెలియజేసి, ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలని డిమాండ్ చేస్తామని తెలిపారు. మాలలంతా ఐక్యతను చాటి ఆగస్టు 31న నిర్వహించే చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పప్పుల గంగాధర్ కోరారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## 108 అంబులెన్స్‌లో గర్భిణీకి సుఖప్రసవం తల్లి, బిడ్డ క్షేమం



**పెద్దమండడి,ఆగస్టు20(తెలంగాణ ముచ్చట్లు):** పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణీకి 108 అంబులెన్స్‌లోనే సుఖప్రసవం జరిగింది. 108 సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రసవం చేయడంతో తల్లి, పండంటి ఆడబిడ్డ క్షేమంగా ఉన్నారు.పెద్దమండడి మండలం గట్ల ఖానాపురం గ్రామానికి చెందిన సరోజ (23), భర్త మోహన్‌కు గురువారం ఉదయం పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వెంటనే 108 సిబ్బంది పైలట్ యోగేశ్వర్, ఈఎంటీ శ్రావణి, ఆశా వర్కర్ కృష్ణవేణి కలిసి సరోజను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్నారు.మార్గ మధ్యంలో సరోజకు నొప్పులు తీవ్రం కావడంతో పరిస్థితిని గమనించిన ఈఎంటీ శ్రావణి, ఆశా వర్కర్ కృష్ణవేణి అంబులెన్స్‌లోనే ప్రసవం చేయించారు. సరోజ పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లి, శిశువును సురక్షితంగా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. అత్యవసర సమయంలో సమయస్ఫూర్తితో స్పందించి అంబులెన్స్‌లోనే సుఖప్రసవం చేయించిన 108 సిబ్బంది పైలట్ యోగేశ్వర్, ఈఎంటీ శ్రావణిని కుటుంబ సభ్యులు, అధికారులు అభినందించారు.

## కర్నె తాండా లిఫ్ట్ పంపులు వెంటనే ప్రారంభించాలి



- ప్రారంభించకపోతే రైతులతో కలిసి ముట్టడిస్తాం
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



**ఖిల్లా ఘణపురం,ఆగస్టు-20(తెలంగాణ ముచ్చట్లు):** కర్నె తాండా ఎత్తిపోతల పథకం పంపులను వెంటనే ప్రారంభించి ఎగువ ప్రాంత రైతులకు సాగునీరు అందించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో పంపులు ప్రారంభించకపోతే వేలాది మంది రైతులతో కలిసి లిఫ్ట్‌ను ముట్టడించి పంపులు ప్రారంభించే వరకు ఆందోళన చేపడతామని హెచ్చరించారు. వనపర్తి జిల్లా ఖిల్లా ఘణపురం మండలంలోని కర్నెతాండా లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించిన నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. రూ.76.16 కోట్లతో చేపట్టిన ఈ పథకం ద్వారా 9 గిరిజన తండాలు, 6 గ్రామాలకు, సుమారు 4,500 ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 90 శాతం పనులు పూర్తయ్యాయని, సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం రూ.2 కోట్లు మంజూరు చేసినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లపాటు కాలయాపన చేసిందని ఆరోపించారు. ప్రస్తుతం కృష్ణా వరదలతో సమృద్ధిగా నీరు ఉన్నందున వెట్‌రన్ నిర్వహించి నిలిపివేసిన పంపులను వెంటనే ప్రారంభించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే రైతులతో కలిసి ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, రాళ్ల కృష్ణయ్య, సామ్యా నాయక్, జాత్రు నాయక్, పీన్యా నాయక్, గోపాల్ నాయక్, నరేష్‌నాయక్ పాల్గొన్నారు.





# భూభారతితో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- **రీ సర్వేలో రైతుల అభ్యంతరాలు పరిష్కరించిన తర్వాతే తుది హక్కుల నమోదు.**
- **బేతుపల్లి రెవెన్యూ గ్రామంలో ఇప్పటికే 6 వేల ఎకరాల సర్వే పూర్తి.**
- **వ్యవసాయ భూములకు వెళ్లే దారులకు పట్టాలు ఇవ్వొద్దు.**
- **చెరువులను పరిరక్షించాలి.**
- **22ఏ భూముల అక్రమ క్రమబద్ధీకరణపై కఠిన చర్యలు.**
- **రాష్ట్రంలో భూ సమస్యలు లేని పరిస్థితి తీసుకురావడమే లక్ష్యం.**
- **మంత్రి పొంగులేటి.**

**సత్తుపల్లి, ఆగస్టు 20 (తెలంగాణ ముచ్చట్లు):-** రాష్ట్రంలోని రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే భూభారతి చట్టం లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. రైతుల భూ హక్కులను పరిరక్షించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధి, నిజాయితీతో పనిచేస్తోందని తెలిపారు. సత్తుపల్లి మండలం నారాయణపురంలో గురువారం కడాస్ట్రల్, నాన్‌కడాస్ట్రల్ గ్రామాల భూ రీ సర్వేపై నిర్వహించిన రైతుల ముఖాముఖి, ప్రత్యేక అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని భేతుపల్లి, రామానగరం, తాళ్లమడ, గంగారం, నారాయణపురం, రామగోవిందపురం, పాకాలగూడెం గ్రామాల పంచాయతీ ప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

**ఆరు వేల ఎకరాల రీ సర్వే పూర్తి**

బేతుపల్లి రెవెన్యూ గ్రామంలో గత 25 రోజులుగా సుమారు 6 వేల ఎకరాల భూ రీ సర్వే నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. మొత్తం 12,047 ఎకరాల భూమి ఉందని, మొత్తం భూమికి రీ సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు. మిగిలిన మరో 6 వేల ఎకరాల భూమికి కూడా సర్వే పూర్తి చేస్తామని తెలిపారు. రీ సర్వే సందర్భంగా రైతులకు ఏవైనా అభ్యంతరాలు, సందేహాలు, లోపాలు కనిపిస్తే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సర్వేలో తప్పులు జరిగితే తమ దృష్టికి తీసుకొస్తే సరిదిద్దేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చూస్తామన్నారు.

**దారులకు పట్టాలు ఇవ్వొద్దు**

వ్యవసాయ భూములకు వెళ్లే దారులు తప్పనిసరిగా ఉండేలా చూడాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పొలాలకు వెళ్లే దారులకు పట్టాలు ఇవ్వొద్దని, వాటిని రైతుల భూముల్లో భాగంగా నమోదు చేయొద్దని స్పష్టం చేశారు. రైతులు తమ పొలాలకు సులభంగా చేరుకునేలా అవసరమైన అప్రోచ్ రోడ్లు, దారులను పరిరక్షించాలని సూచించారు.

చెరువులను తప్పనిసరిగా పరిరక్షించాలని అన్నారు. చెరువులకు అవసరమైన హద్దులు, రక్షణ చర్యలు, కాంపౌండ్ నిర్మాణం వంటి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సరిహద్దులను కూడా స్పష్టంగా నిర్ధారించాలని సూచించారు. చెరువులను పరిరక్షిస్తే భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు.

**2,026 ఎకరాల అసైన్డ్ భూమి**

బేతుపల్లి రెవెన్యూ గ్రామంలో మొత్తం 12,047 ఎకరాల భూమి ఉండగా సుమారు 2,026 ఎకరాలు అసైన్డ్ భూములుగా ఉన్నాయని మంత్రి తెలిపారు. ఇందులో సుమారు 980 ఎకరాలను పేదలకు అందించినట్లు చెప్పారు. మరో వెయ్యి ఎకరాల వరకు అసైన్డ్ భూముల్లో కొంతమంది రైతులు సాగు చేస్తున్నప్పటికీ వారికి పట్టాలు లేవని వివరించారు. అసైన్డ్ భూములకు సంబంధించిన పట్టాలు ఎక్కడా కోల్పోవని మంత్రి స్పష్టం చేశారు. అర్హులైన రైతుల హక్కులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. భూమిపై హక్కులు కల్పించే ప్రక్రియలో నిబంధనల ప్రకారం అన్ని అంశాలను పరిశీలిస్తామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో నిజంగా భూమిపై ఉన్న రైతులకు హక్కులు దక్కలేదని, భూములు లేని కొంతమందికి కూడా రైతుబంధు ప్రయోజనాలు అందిన పరిస్థితులు ఏర్పడ్డాయని మంత్రి విమర్శించారు. నాగార్జునసాగర్ పైలట్ ప్రాజెక్టు పరిధిలో నిర్వహించిన సర్వేలో సుమారు 3,400 నకిలీ పట్టాదారు పాస్‌బుక్‌లు బయటపడ్డాయని తెలిపారు. భూమి రైతులకు అత్యంత భావోద్వేగంతో కూడుకున్న అంశమని, ఇది రాజకీయ అంశం కాదని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలను కాపాడటం ప్రభుత్వ బాధ్యతని, నిజమైన రైతులకు భూ హక్కులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

**బేతుపల్లిపై ప్రత్యేక దృష్టి**

బేతుపల్లి గ్రామం తనకు కొత్త కాదని మంత్రి అన్నారు. గ్రామంలోని భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు కూడా గ్రామ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూ రీ సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి రైతు భూమికి ఖచ్చితమైన కోఆర్డినేట్లు, మ్యాప్ రూపొందించి భూ హక్కులను నమోదు చేస్తామని చెప్పారు. రైతులు తుది టైటిల్స్ కోసం ఎదురుచూస్తున్నారని, రీ సర్వే పూర్తయిన తర్వాత నిబంధనల మేరకు ప్రక్రియను పూర్తి చేసి తుది హక్కులు అందజేస్తామని తెలిపారు.

**ఏడాదిన్నరలో రీ సర్వే**

రాష్ట్రవ్యాప్తంగా భూ రీ సర్వే మొదటి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి చేపట్టినట్లు మంత్రి వెల్లడించారు. వచ్చే ఏడాదిన్నర కాలంలో రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ భూములతో పాటు ఆబాది ఆస్తుల రీ సర్వేను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. రీ సర్వే పూర్తయిన తర్వాత 30 రోజుల పాటు రైతుల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తామని చెప్పారు. వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి, పరిష్కరించిన తర్వాతే తుది హక్కులను నమోదు చేస్తామని స్పష్టం చేశారు. మనుషులకు ఆధార్ కార్డులు ఉన్నట్లుగానే రైతుల భూములకు కూడా భూధార్ కార్డులు అందజేస్తామని తెలిపారు. రీ సర్వేలో ప్రతిరోజూ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని, ప్రస్తుతం భేతుపల్లిలో కూడా ఇదే విధానంలో సర్వే జరుగుతోందని చెప్పారు. సర్వే సమయంలో కొన్ని సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, రైతులు వాటిని అధికారుల దృష్టికి తీసుకువస్తే సరిచేసి తుది ప్రక్రియలో చేర్చుతామని తెలిపారు.

**మూడు నెలల్లో నిబంధనలు**

భూభారతి చట్టాన్ని తమ ప్రభుత్వం రైతుల ప్రయోజనాల కోసం తీసుకువచ్చిందని మంత్రి తెలిపారు. చిత్తశుద్ధి, నిజాయితీతో భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రజలకు, రైతులకు తమ ప్రభుత్వ చిత్తశుద్ధి, నిజాయితీ ఏమిటో తెలుసన్నారు. గత ప్రభుత్వం ధరణికి సంబంధించి నిబంధనలను కూడా పూర్తిస్థాయిలో రూపొందించలేదని విమర్శించారు. భూభారతి చట్టానికి మాత్రం కేవలం మూడు నెలల్లోనే నిబంధనలు రూపొందించినట్లు తెలిపారు. భూభారతి చట్టం రైతులకు ఉపయోగపడేలా పనిచేస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా తాను పర్యటించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తున్నానని చెప్పారు. కొంతమంది ప్రతిపక్ష నాయకులు తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి ఆరోపించారు. ప్రజలు త్వరలోనే వారికి మరోసారి బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు.

**22ఏ భూములపై కఠిన చర్యలు**

కొంతమంది భూ ఆక్రమణదారులు అమాయక ప్రజలను అడ్డుపెట్టుకుని 22ఏ భూములను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మంత్రి అన్నారు. ఇలాంటి ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేశారు. ఇప్పటికే వారిపై చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. సామాన్య ప్రజలను ముందు పెట్టి అక్రమంగా దోచుకున్న భూములను రెగ్యులరైజ్ చేసుకునేందుకు చేసే ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఫలించబోవని హెచ్చరించారు.

**క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరిస్తాం**

జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ మంత్రి ఇచ్చిన ఆదేశాల మేరకు జిల్లా రెవెన్యూ యంత్రాంగం మొత్తం క్షేత్రస్థాయిలో పనిచేసి రైతుల భూ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రతి భూ సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. స్థానిక నాయకులు దయానంద్ మాట్లాడుతూ ధరణి కారణంగా అనేక మంది రైతులు భూ సమస్యలను ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సత్తుపల్లి ప్రాంతంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. ప్రతిరోజూ సుమారు 200 నుంచి 300 ఎకరాల వరకు భూ రీ సర్వే జరుగుతోందని, ఇప్పటివరకు సుమారు 6 వేల ఎకరాల సర్వే పూర్తయిందని తెలిపారు. భవిష్యత్తులో మరో 6 వేల ఎకరాల భూమికి సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. ధరణి సమయంలో భూములు లేని కొంతమంది కూడా నకిలీ పట్టాదారు పాస్‌బుక్‌లు పొందినట్లు గుర్తించామని, అర్హత లేని పాస్‌బుక్‌లను రద్దు చేసి వాటి ఆధారంగా పొందిన రైతుబంధు మొత్తాలను రికవరీ చేయాలని దయానంద్ కోరారు. భూ రీ సర్వేలో రైతులు రెవెన్యూ అధికారులకు పూర్తి సహకారం అందించాలని సూచించారు.

**రైతుల సమస్యలు మంత్రి దృష్టికి**

రైతులు మాట్లాడుతూ భూ రీ సర్వే పారదర్శకంగా జరుగుతోందని తెలిపారు. పొరుగు రైతుల సమ్మతితోనే భూముల హద్దులను నిర్ణయిస్తున్నారని చెప్పారు. అయితే భూములు ప్రొహిబిటెడ్ లిస్ట్‌లో ఉండటంతో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని, అర్హులైన రైతులందరికీ పట్టాదారు పాస్‌బుక్‌లు జారీ చేసి సమస్యను పరిష్కరించాలని మంత్రిని కోరారు. యెనుకట్లలోని 33 ఎకరాల చెరువును కొంతమంది ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని రైతులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. చెరువును పరిరక్షించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. చెరువును రక్షిస్తే భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. పొలాలకు వెళ్లే దారుల కోసం కొంతమంది సర్వే చేస్తున్నారని, ఆ దారులను పట్టాదారు పాస్‌బుక్‌లో భూమిగా నమోదు చేయకుండా చూడాలని కోరారు. కిష్టాపురం గ్రామంలోని సర్వే నంబర్ 263లో 721 ఎకరాల అసైన్డ్ భూమి ఉండగా, 811 ఎకరాలు పంపిణీ చేసినట్లు నమోదైందని రైతులు తెలిపారు. అదనంగా చూపిస్తున్న 90 ఎకరాల కేటాయింపుపై విచారణ జరిపి సమస్యను పరిష్కరించాలని కోరారు.

**పలువురు అధికారులు హాజరు**

కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, డీఎఫ్ఓ అనూజ్ అగర్వాల్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఏసీపీ వసుంధర యాదవ్, ఆర్అండ్‌బీ ఎస్ఈ యుగంధర్ రావు, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస చారి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీ వీరభద్ర దేవాలయ ధ్వజస్తంభం స్థాపన

**ధ్వజస్తంభ దాతలను సన్మానించిన గ్రామస్తులు**

**పెద్దమండడి,ఆగస్టు20(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమండడి మండలం, బలిజపల్లి గ్రామంలోని శ్రీ వీరభద్ర స్వామి దేవాలయంలో ధ్వజస్తంభ స్థాపన, ప్రాణప్రతిష్ఠతో పాటు పోచమ్మ పండుగ కార్యక్రమాలను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ ధ్వజస్తంభ స్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం శ్రీ వీరభద్ర స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, అర్చనలు నిర్వహించారు. పోచమ్మ తల్లికి కూడా ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ ప్రజలంతా పండుగను ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా కలకొండ మీనాక్షమ్మ-శంకరయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు వేణుగోపాల్ టీచర్ కుటుంబ సభ్యులు ధ్వజస్తంభాన్ని సమకూర్చారు. ఆలయానికి ధ్వజస్తంభాన్ని అందించిన వేణుగోపాల్ టీచర్ కుటుంబ సభ్యులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. వారికి శాలువాలు కప్పి, పుష్పమాలలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.ఆలయ అభివృద్ధికి దాత కుటుంబం అందించిన సహకారం అభినందనీయమని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ధ్వజస్తంభాన్ని సమకూర్చడం ద్వారా వేణుగోపాల్ టీచర్ కుటుంబ సభ్యులు ఆధ్యాత్మిక సేవకు నిదర్శనంగా నిలిచారని గ్రామస్తులు కొనియాడారు. అలాగే పెద్దమందడి మండల మాజీ రైతుబంధు అధ్యక్షులు రాజప్రకాష్ రెడ్డి అన్నదాన కార్యక్రమానికి 10 క్వింటాల్ బియ్యం, 4 క్వింటాల్ వడ్లు విరాళం ఇచ్చినట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. రాజప్రకాష్‌రెడ్డి కుటుంబానికి శ్రీ వీరభద్ర స్వామి కృప కటాక్షాలు మెండుగా ఉండాలని మనస్ఫూర్తిగా ఆలయ కమిటీ కోరారు. పోచమ్మ పండుగ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ వీరభద్ర స్వామివారిని, పోచమ్మ తల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించడంతో ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తో పాటు, గ్రామ పెద్దలు,భక్తులు, నిర్వాహకులు పాల్గొన్నారు.



తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం



- **ఎమ్మెల్యే మేఘా రెడ్డి**

**వనపర్తి,ఆగస్టు20(తెలంగాణ ముచ్చట్లు):** మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా వనపర్తి రాజీవ్ గాంధీ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ చరిత్రలో రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయమని అన్నారు. భారత దేశాన్ని ఆధునిక సాంకేతిక యుగం వైపు నడిపించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. కంప్యూటర్, టెలికమ్యూనికేషన్ రంగాల అభివృద్ధికి పునాదులు వేసిన రాజీవ్‌గాంధీ, యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి ప్రజాస్వామ్యంలో వారి భాగస్వామ్యాన్ని పెంచారని తెలిపారు. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసి గ్రామీణాభివృద్ధికి కృషి చేశారని, దేశ ఐక్యత, సమగ్రత, అభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలు నేటి తరానికి ఆదర్శమని అన్నారు. రాజీవ్‌గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, పట్టణ అధ్యక్షుడు కదిరె రాములు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి



- **పలుస శంకర్‌గౌడ్ జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షులు**

**వనపర్తి,ఆగస్టు20(తెలంగాణ ముచ్చట్లు):** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని వనపర్తి జిల్లా సాహితీ కళా వేదిక అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. గురువారం పెబ్బేరు మండలం యాపర్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు ఉసేన్‌ను శాలువా, జ్ఞాపికతో సత్కరించారు.ఈ సందర్భంగా శంకర్‌గౌడ్ మాట్లాడుతూ ప్రతి అవసరానికీ ప్రభుత్వంపై ఆధార పడకుండా దాతలు, గ్రామస్తుల సహకారంతో పాఠశాలల్లో అవసరమైన వనరులు, వసతులు సమకూర్చుకోవాలని సూచించారు. విద్యార్థుల సంఖ్య పెంపుతో పాటు తరగతి గదులు, ఉపాధ్యాయుల సమకూర్పు, బడితోట అభివృద్ధికి హెచ్‌ఎం ఉసేన్ చేస్తున్న కృషిని అభినందించారు.కార్యక్రమంలో కళా వేదిక ప్రతినిధులు బైరోజు చంద్రశేఖర్, మైనొద్దిన్, విష్ణు, కవిత తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో క్రమశిక్షణ అవసరం



- **ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్యకు గార్డియన్ స్కూల్‌లో సంతాపం**

**జమ్మికుంట టౌన్, ఆగస్టు 20 (తెలంగాణ ముచ్చట్లు):** నల్గొండ జిల్లాలో ఈ నెల 11న నాగార్జున పాఠశాల ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్యకు గురైన ఘటనను నిరసిస్తూ జమ్మికుంట పట్టణంలోని కొత్తపల్లి గార్డియన్ స్కూల్‌లో సంతాప కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ మహమ్మద్ అంకూస్ ఆధ్వర్యంలో రూపారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహమ్మద్ అంకూస్ మాట్లాడుతూ ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్య ఘటన అత్యంత దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ప్రవర్తన, క్రమశిక్షణపై తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలపై అతిగా గారాబం చూపడం వల్ల వారు చెడు అలవాట్లకు బానిసలయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థుల క్రమశిక్షణ విషయంలో ఉపాధ్యాయులకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. సమాజం సిగ్గుపడేలా జరిగిన ఇలాంటి ఘటనలు భవిష్యత్ తరాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లల ప్రవర్తన, స్నేహాలు, చదువు, అలవాట్లను తల్లిదండ్రులు నిత్యం గమనిస్తూ వారికి సరైన మార్గనిర్దేశం చేయాలని సూచించారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందించేందుకు పాఠశాలలు, తల్లిదండ్రులు కలిసి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.
కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొని రూపారెడ్డికి నివాళులర్పించారు.





# విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట.!


- **పట్టణ పేదలకు మెరుగైన వైద్య సేవలు.**
- **విద్య, వైద్యం, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి.**
- **మంత్రి పొంగులేటి.**

**సత్తుపల్లి, ఆగస్టు 20 (తెలంగాణ ముచ్చట్లు):** విద్య, వైద్య రంగాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో రూ.1.83 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించి, మరికొన్ని పనులకు శంకుస్థాపన చేశారు. ఎన్టీఆర్‌నగర్‌లో రూ.1.43 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. పట్టణ పేదలకు నాణ్యమైన ఉచిత ప్రాథమిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం శివసాయినగర్‌లో రూ.40 లక్షలతో నిర్మించనున్న మల్టీపర్పస్ మున్సిపల్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ భవనం స్థానికుల సామాజిక కార్యక్రమాలు, శుభకార్యాలకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కలకు ఇందిరమ్మ ఇళ్ల భరోసా

- **పోతిరెడ్డిపల్లిలో అర్హులైన నిరుపేదలకు మంజూరు పత్రాల అందజేత**

**వీణవంక, ఆగస్టు 20 (తెలంగాణ ముచ్చట్లు):-** పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా కరీంనగర్ జిల్లా వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో అర్హులైన నిరుపేదలకు గురువారం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు.




ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తూ ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాల సొంతింటి కల నెరవేరుతుందని, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.
కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాపర్తి సంధ్య, రవి, సతీశ్‌తో పాటు పలువురు నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఆధునిక భారత నిర్మాణానికి రాజీవ్ గాంధీ కృషి చిరస్మరణీయం

- **ఇల్లందకుంటలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు**

**ఇల్లందకుంట, ఆగస్టు 20 (తెలంగాణ ముచ్చట్లు):** మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని కరీంనగర్ జిల్లా ఇల్లందకుంటలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెద్ది కుమార్ మాట్లాడుతూ ఆధునిక భారత



నిర్మాణం, సాంకేతిక రంగ అభివృద్ధి, యువత సాధికారతకు రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. దేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించేలా ఆయన తీసుకున్న నిర్ణయాలు నేటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అనంతరం 18 ఏళ్లు నిండిన యువతను ఓటర్లుగా నమోదు చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. నూతన ఓటర్ల నమోదు కోసం ఫారం6 ద్వారా దరఖాస్తులను స్వీకరించి, వాటిని తహశీల్దార్ మనోజ్ కుమార్‌కు అందజేశారు. యువత తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని నాయకులు సూచించారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

- **ఇండియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో కస్టమర్ అవగాహన కార్యక్రమం**

**జమ్మికుంట టౌన్, ఆగస్టు 20 (తెలంగాణ ముచ్చట్లు):** సైబర్ నేరాల పట్ల ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని జమ్మికుంట పట్టణంలోని ఇండియన్ బ్యాంక్ అధికారులు సూచించారు. బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ హరినాథ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కస్టమర్ అవగాహన కార్యక్రమంలో ఖాతాదారులకు బ్యాంకింగ్ సేవలతో పాటు సైబర్ మోసాల నివారణపై పలు కీలక సూచనలు చేశారు.
ఖాతా నంబర్, ఏటీఎం పిన్, ఓటీపీ, పాస్‌వర్డ్, సీవీవీ వంటి అత్యంత రహస్యమైన వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు స్పందించేటప్పుడు జాగ్రత్త వహించాలని, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయడం,






గుర్తుతెలియని యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.
ఏటీఎం కార్డు వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కార్డు పోయినప్పుడు వెంటనే తీసుకోవాల్సిన చర్యలు, ఖాతాలో అనుమానాస్పద లావాదేవీలు గుర్తించిన వెంటనే బ్యాంకును సంప్రదించాల్సిన ఆవశ్యకతపై ఖాతాదారులకు అవగాహన కల్పించారు.
అదేవిధంగా బ్యాంకు అందిస్తున్న వివిధ రకాల రుణాలు, బంగారు రుణాలపై కూడా అధికారులు వివరించారు. రుణం తీసుకునే ముందు వడ్డీ రేటు, కాలపరిమితి, వాయిదాలు, ఇతర నిబంధనలను పూర్తిగా తెలుసుకున్న తర్వాతే రుణం తీసుకోవాలని సూచించారు.
రూ.200 కోట్లకు పైగా లావాదేవీలు
జమ్మికుంటలో ఇండియన్ బ్యాంక్ శాఖ 2018లో ప్రారంభమైందని, ప్రస్తుతం రూ.200 కోట్లకు పైగా లావాదేవీలను నిర్వహిస్తూ ఖాతాదారులకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందిస్తున్నట్లు బ్యాంకు సిబ్బంది తెలిపారు.
ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ప్రశాంత్, గణేష్, శ్రీకాంత్, హర్షతో పాటు పలువురు ఖాతాదారులు పాల్గొన్నారు.

# పేదల హక్కుల కోసం రాజీలేని పోరాటం

- **తెలంగాణ పేదల రాజ్యాధికార సమితి కరీంనగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రత్నం అశోక్**

**జమ్మికుంట టౌన్, ఆగస్టు 20 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ పేదల రాజ్యాధికార సమితి కరీంనగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జమ్మికుంట మండలానికి చెందిన రత్నం అశోక్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సింగారం ప్రేమ్ కుమార్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు.సామాజిక, కుల సంఘాల కార్యక్రమాలతో పాటు ప్రజా ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న రత్నం అశోక్ సేవలను గుర్తించిన రాష్ట్ర నాయకత్వం ఆయనకు ఈ కీలక బాధ్యతను అప్పగించింది. సమాజంలో చైతన్యం తీసుకురావడంలో ఆయన చేసిన కృషిని సంఘం నాయకులు కొనియాడారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం రత్నం అశోక్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించిన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సింగారం ప్రేమ్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పలాటి రాజు కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రావు, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు బోరగాల సమ్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రఘుచారి, ఉమ్మడి జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలుస్తానని అశోక్ పేర్కొన్నారు. పేదల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తానని, అవినీతిపై రాజీలేని పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు. తనకు అప్పగించిన బాధ్యతను ప్రజల విశ్వాసానికి అనుగుణంగా సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, పేదల సమస్యలపై గళమెత్తి వారి హక్కుల సాధనకు కృషి చేస్తానని తెలిపారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

## అల్వాలలో ఇందిరమ్మ ఇళ్లకు అర్హుల పరిశీలన



**పెద్దమందడి,ఆగస్టు20(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అల్వాల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి అర్హుల పరిశీలన ప్రక్రియ గురువారం కొనసాగింది. మండల వ్యవసాయ అధికారి సైదులు యాదవ్ ఆధ్వర్యంలో అధికారులు గ్రామంలో పర్యటించి నిరుపేద కుటుంబాల నివాసాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఇందులో భాగంగా అఖిల్ పాషా, నక్క హరికృష్ణ, కాజాభి, మన్నెమ్మ, శంకరమ్మ, మిద్దె సుగుణమ్మ, మన్నెం తదితరులు నివసిస్తున్న గుడిసెలను అధికారులు సందర్శించి వారి కుటుంబ పరిస్థితులు, నివాస స్థితిగతులు, అర్హతకు సంబంధించిన వివరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ నాయకుడు జి. సుదర్శన్ రెడ్డి, సర్పంచ్ మాలపల్లి రాజమహేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులైన నిరుపేద కుటుంబాలు ఇంకా ఎవరైనా ఉంటే వారి వివరాలను కూడా పరిశీలించి, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా కృషి చేస్తామని తెలిపారు.ప్రభుత్వ పథకాలు నిజమైన అర్హులకు అందేలా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో ఇళ్లులేని నిరుపేద కుటుంబాలను గుర్తించి వారికి ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.కార్యక్రమంలో చంద్రశేఖర్ రెడ్డి, కుప్పిరెడ్డి బాల్‌రెడ్డి, కొత్త గొల్ల ఆశన్న యాదవ్‌తో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# అంజాద్ బైక్ పాయింట్ ప్రారంభించిన అజీజ్ బేగ్ మిర్జా, బొమ్మగోని చైతన్య గౌడ్



**ఉప్పల్,ఆగస్టు20(తెలంగాణ ముచ్చట్లు):** చిలకనగర్ డివిజన్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంజాద్ బైక్ పాయింట్‌ను డీసీసీ మైనారిటీ చైర్మన్ అజీజ్ బేగ్ మిర్జా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బొమ్మగోని చైతన్య గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు, స్థానికులు హాజరయ్యారు.అజీజ్ బేగ్ మిర్జా, బొమ్మగోని చైతన్య గౌడ్ లాంఛనంగా బైక్ పాయింట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా బైక్ పాయింట్ నిర్వాహకుడు హంసద్, చైతన్య గౌడ్‌ను పూలమాలతో సత్కరించి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం బైక్ పాయింట్‌లో అందించే సేవలు, నిర్వహణకు సంబంధించిన వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చిలకనగర్ పరిసర ప్రాంతాల ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా నూతన బైక్ పాయింట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తూ వ్యాపారాన్ని విజయవంతంగా కొనసాగించాలని నిర్వాహకులకు సూచించారు. స్థానికంగా నూతన వ్యాపారాలు ఏర్పాటవడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బజారు జగన్నాథ్ గౌడ్, చిలకనగర్ డివిజన్ మైనారిటీ అధ్యక్షుడు ఎస్కే మోయినుద్దీన్ మామూ, డివిజన్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మంచాల రఘు, బియ్యం కిరణ్, జాంగీర్, అంజద్, మన్నన్ భాష, అల్తాఫ్, ఆసిఫ్, జనాబీ, శరత్, సురేష్, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.



## రూపారెడ్డి మృతికి ట్రస్మా క్యాండిల్ ర్యాలీ

- **విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందించాలి**

**హుజూరాబాద్, ఆగస్టు 20(తెలంగాణ ముచ్చట్లు ):** విద్యార్థుల చేతిలో అమానుషంగా హత్యకు గురైన ప్రిన్సిపాల్ శ్రీమతి రూపారెడ్డి మృతికి సంతాపంగా, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ గురువారం హుజూరాబాద్ అంబేద్కర్ చౌరస్తా వద్ద ట్రస్మా ఆధ్వర్యంలో భారీ క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, ట్రస్మా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని రూపారెడ్డి మృతికి నివాళులర్పించారు.

కొవ్వొత్తులు చేతబూనిన నాయకులు, ఉపాధ్యాయులు అంబేద్కర్ చౌరస్తా పరిసరాల్లో ర్యాలీ నిర్వహిస్తూ రూపారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. విద్యాబోధనతో పాటు విద్యార్థుల్లో క్రమశిక్షణ, సంస్కారం, నైతిక విలువలు పెంపొందించడంపై పాఠశాలలు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు.

విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య పరస్పర గౌరవం, బాధ్యతాయుతమైన సంబంధాలు ఉండేలా తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యార్థుల్లో పెరుగుతున్న ఆగ్రహావేశాలు, క్రమశిక్షణారాహిత్యాన్ని అరికట్టేందుకు పాఠశాల స్థాయిలో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్య ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, భవిష్యత్తులో ఇలాంటి విషాదకర ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం సమగ్ర చర్యలు తీసుకోవాలని ట్రస్మా నాయకులు డిమాండ్ చేశారు. విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు, సిబ్బందికి భద్రత కల్పించడంతో పాటు విద్యార్థులకు మానవీయ విలువలు, బాధ్యత, క్రమశిక్షణపై ప్రత్యేక అవగాహన కల్పించాలని కోరారు. ఉపాధ్యాయులపై దాడులు, విద్యాసంస్థల్లో హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కోరం సంజీవరెడ్డి, పట్టణ అధ్యక్షుడు వకుళభరణం వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పారెడ్డి రవీందర్‌రెడ్డి, కోశాధికారి కోటేశ్వర్, కరస్పాండెంట్ ఎం. నారాయణరెడ్డి, మాడిశెట్టి ప్రసాద్, కిరణ్, బి. రాజ్‌కుమార్, వేణుమాధవ్, షాజు థామస్, పి. సతీష్‌తో పాటు పలువురు పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కమలాపూర్ డబుల్ బెడ్రూం ఇళ్ల పై బీఆర్ఎస్ పోరుబాట





- **అర్హులకు ఇళ్లు కేటాయించాలి.. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్**

**హుజురాబాద్,ఆగష్టు 20(తెలంగాణ ముచ్చట్లు ):** మండల కేంద్రంలో రూ.ఇరవై కోట్ల వ్యయంతో నిర్మించిన మూడు వందల తొబ్బాయ్ నాలుగు డబుల్ బెడ్రూం ఇళ్లను వెంటనే అర్హులైన పేదలకు కేటాయించాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. లబ్ధిదారుల జాబితాను వారం రోజుల్లో ప్రకటిస్తామని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ఇచ్చిన హామీకి పది రోజులు గడిచినా అమలు కాలేదని విమర్శించారు. డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయాల్లో రోడ్లు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ వంటి కనీస మౌలిక వసతులు పూర్తికాకపోవడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. మౌలిక వసతులు కల్పించకుండా ఇళ్లను ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. గూడూరు, మరిపల్లిగూడెం ప్రాంతాల్లో నిర్మించిన ఇళ్ల పరిస్థితి కూడా ఇలాగే ఉందన్నారు. ఇళ్ల కేటాయింపుల్లో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వెంటనే ప్రొసీడింగ్స్ అందజేయడంతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

ప్రభుత్వం వెంటనే స్పందించి అర్హులైన పేదలకు న్యాయం చేయాలని సూచించారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి, పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని పాడి కౌశిక్ రెడ్డి హెచ్చరించారు.

# బీసీ చైతన్యానికి శ్రీనివాస్ విశేష సేవలు

- **సామాజిక సేవల్లో ముందుంటూ మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి**



**హుజురాబాద్, ఆగస్టు 20(తెలంగాణ ముచ్చట్లు ):** బీసీ ఆజాద్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలుకమారి శ్రీనివాస్ జన్మదిన వేడుకలను హుజూరాబాద్ పట్టణ కేంద్రంలో డివిజన్ అధ్యక్షుడు పంజాల తిరుపతి గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా పంజాల తిరుపతి గౌడ్ మాట్లాడుతూ.. చిలుకమారి శ్రీనివాస్ వైద్య వృత్తిలో కొనసాగుతూ ప్రజలకు సేవలందించడంతో పాటు కాట్రపల్లి గ్రామంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానం చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారని తెలిపారు. పద్మశాలి కులపరమైన సేవా కార్యక్రమాలతో పాటు సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారని పేర్కొన్నారు. బీసీ ఉద్యమాల పట్ల ప్రజల్లో చైతన్యం కల్పిస్తూ, స్నేహితులతో కలిసి పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్న శ్రీనివాస్ భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి ప్రజలకు సేవలు అందించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో సిలివేరు శ్రీకాంత్, రాష్ట్ర పద్మశాలి సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ సంగెం సత్యనారాయణ, పాత్రికేయులు శివమణి, బీసీ నాయకులు కోడూరి శ్రీనివాస్, పబ్బ తిరుపతి, డాక్టర్ సంగెం ఐలయ్య, కందుకూరి భాస్కర్, మంచికట్ల కమలాకర్, రాజు, బొంగోని చంద్రమౌళి, ఆకుల సదానందం, మునీందర్, శ్రీనివాస్, ఉమా శంకర్, సాయి, శ్రావణ్, బొంగోని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# “నేనున్నా” అంటూ నామ ఆత్మీయ పరామర్శలు

- **ఏన్కూరు మండలంలో పర్యటించిన మాజీ ఎంపీ నామ**



**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 20(తెలంగాణ ముచ్చట్లు ):** ఏన్కూర్ మండలంలో బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు “నేనున్నా” అంటూ భరోసా కల్పిస్తూ బుధవారం పలు కుటుంబాలను పరామర్శించారు. మొదటగా ఏన్కూర్ వాస్తవ్యులు దుగ్గిరాల రమేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకొని వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు అలానే రమేష్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం టీఎల్ పేట గ్రామానికి చేరుకున్న నామ, టీడీపీ సీనియర్ నేత కళ్యాణపు వెంకటేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకుని వారి స్వగృహానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆ తర్వాత బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వాసిరెడ్డి వెంకటేశ్వర్లు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స అనంతరం స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న నామ వారి ఇంటికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకొని ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. లకావత్ గిరిబాబు, మనీషా లక్ష్మీ మదన్ లాల్, మోరంపూడి ప్రసాద్ రావు, మాజీ జెడ్పిటిసి శ్యామల, రామారావు, నామ వెంకటేశ్వరరావు, మదినేని అశోక్, బుగ్గినేని వెంకటేశ్వరరావు, మల్లెంపాటి మాధవరావు, వేముల రమేష్, పూర్ణకంటి నాగరాజు, తాళ్లూరి అప్పారావు, తాళ్లూరి నరసింహారావు, వాకదాని కోటేశ్వరరావు, రేగళ్ల కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు



## జర్నలిస్టుల న్యాయపోరాటానికి బీఎస్పీ మద్దతు

- **దీక్షలకు సంఘీభావం.. అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్**

**హుజూరాబాద్, ఆగస్టు 20(తెలంగాణ ముచ్చట్లు ):** జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధన కోసం హుజూరాబాద్‌లో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. అంబేద్కర్ చౌరస్తా వద్ద చేపట్టిన దీక్షలు ఐదో రోజుకు చేరుకున్న సందర్భంగా బీఎస్పీ నాయకులు దీక్షా శిబిరాన్ని సందర్శించి జర్నలిస్టులకు సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె ప్రశాంత్ గౌడ్ మాట్లాడుతూ.. జర్నలిస్టులు ఎన్నో ఏళ్లుగా ఇళ్ల స్థలాల కోసం పోరాటం చేస్తున్నారని, వారి న్యాయమైన డిమాండ్‌ను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. జర్నలిస్టుల పోరాటం ఫలితంగా ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసినప్పటికీ, వాటిపై వివాదాలు, కోర్టు కేసులు ఏర్పడటం బాధాకరమన్నారు.

ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా ఉన్న జర్నలిస్టుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై ఉన్న అక్రమ కేసులను ఎత్తివేసి, వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ విభేదాలను జర్నలిస్టుల సంక్షేమానికి అడ్డంకిగా మార్చడం సరికాదన్నారు.

దీక్షా శిబిరంలో జర్నలిస్టులు నల్ల బెలూన్లను ఎగురవేసి వినూత్నంగా నిరసన తెలిపారు. తమ సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని జర్నలిస్టులు స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఇళ్ల స్థలాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు, జర్నలిస్టులు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొని సంఘీభావం తెలిపారు. జర్నలిస్టుల న్యాయమైన పోరాటానికి తమ మద్దతు కొనసాగుతుందని బీఎస్పీ నాయకులు ప్రకటించారు.

## నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన



**ఖమ్మం బ్యూరో, ఆగస్ట్ 20(తెలంగాణ ముచ్చట్లు ):** నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి పాఠశాల ప్రిన్సిపల్ రూపారెడ్డి దారుణ హత్యను నిరసిస్తూ నాగులవంచ శ్రీ ఆదర్శ విద్యాలయంలో ఉపాధ్యాయులు గురువారం నిరసన తెలిపారు. పాఠశాల మేనేజ్మెంట్, ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఆమె హత్యను తీవ్రంగా ఖండించారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులే ఇలాంటి దుశ్చర్యకు పాల్పడటం దారుణమని పాఠశాల కరస్పాండెంట్ బోడెపుడి కిరణ్ తెలిపారు. ఆమె హత్యను నిరసిస్తూ శుక్రవారం పాఠశాలలు బంద్ పాటిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చావా అరుణ్ కుమార్, ఉపాధ్యాయులు బోళ్ళ రేణుక, పార్వతి, జొన్నలగడ్డ శ్రీనివాస్, పందిరి పుల్లారావు, సుజాత, సుజిత, త్రివేణి, చందన పాల్గొన్నారు.

# మెడిపల్లిలో కల్తీ మసాలాల గుట్టురట్టు

(మొదటి పేజీ తరువాయి)

ఈ దాడుల్లో సుమారు రూ.25 లక్షల విలువైన 10.89 టన్నుల మసాలా పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారంతో ఎస్‌ఓటీ మల్కాజిగిరి, ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ బృందాలు తనిఖీలు నిర్వహించగా పసుపు పొడి, కారం పొడి, ధనియాల పొడి, గరం మసాలాలను ఆహార భద్రతా ప్రమాణాలు పాటించకుండా తయారు చేస్తున్నట్లు బయటపడింది. ముఖ్యంగా కారం పొడిలో 30 శాతం వరకు రంపపు పొడి కలిపినట్లు గుర్తించడం అధికారులను విస్మయానికి గురిచేసింది. ప్రజలు ఉపయోగించే మసాలా దినుసులనే కల్తీ వ్యాపారానికి వినియోగిస్తున్న తీరును పోలీసులు తీవ్రంగా పరిగణించారు.

తనిఖీల్లో అసలు బ్రాండ్లను పోలిన నకిలీ ప్యాకింగ్, లేబుళ్లను ఉపయోగించి వినియోగదారులను మోసం చేస్తున్నట్లు కూడా గుర్తించారు. నాసిరకం ఉత్పత్తులను ఆకర్షణీయమైన ప్యాకెట్లలో నింపి మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు వెల్లడైంది. ఈ వ్యవహారంలో సత్యనారాయణ, రుద్రశేఖర్ అనే ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. దాడిలో 2,300 కిలోల పసుపు పొడి, 3,350 కిలోల కారం పొడి, 5,140 కిలోల ధనియాల పొడి, 100 కిలోల గరం మసాలా స్వాధీనం చేసుకున్నారు. తయారీ, ప్యాకింగ్‌కు ఉపయోగిస్తున్న ముడి పదార్థాలు, యంత్రాలు, ప్యాకింగ్ సామగ్రిని కూడా పరిశీలించి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సరుకును మెడిపల్లి




పోలీస్ స్టేషన్‌కు తరలించి తదుపరి చర్యలు చేపట్టారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ బి. సుమతి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే వారిపై చట్టం ఉక్కుపాదం మోపుతుందని హెచ్చరించారు. వినియోగదారుల నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని కల్తీ ఆహార పదార్థాలను మార్కెట్‌లోకి పంపడం అత్యంత తీవ్రమైన నేరమని పేర్కొన్నారు. ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై నిరంతర నిఘా కొనసాగుతుందని స్పష్టం చేశారు. వినియోగదారులు ప్యాకేజ్డ్ ఆహార పదార్థాలు కొనుగోలు చేసే సమయంలో తయారీ తేదీ, గడువు, బ్యాచ్ నంబర్, ఆహార భద్రతా గుర్తింపు వివరాలను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. తమ పరిసరాల్లో కల్తీ ఆహార పదార్థాల తయారీ లేదా విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజారోగ్యాన్ని కాపాడటంలో ప్రజల అప్రమత్తత కూడా కీలకమని బి. సుమతి పేర్కొన్నారు.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి ఎస్సై పట్టుబాటు

(మొదటి పేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో తన సహకారం అందించేందుకు ఎస్సై రూ.30 వేల లంచం ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు తెలిసింది.

ఎస్సై డిమాండ్‌తో విసిగిపోయిన బాధితుడు నేరుగా ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదును స్వీకరించిన అధికారులు ప్రాథమిక విచారణ నిర్వహించి ఆరోపణల్లో నిజానిజాలను నిర్ధారించారు. అనంతరం ప్రత్యేక వ్యూహం రూపొందించి ఎస్సైని పట్టుకునేందుకు ఉచ్చుపన్నారు. ఏసీబీ సూచనల మేరకు బాధితుడు లంచం మొత్తాన్ని ఎస్సైకు అందజేయగా, గురువారం ఆయన స్వగృహంలోనే డబ్బు స్వీకరిస్తున్న సమయంలో అధికారులు దాడి నిర్వహించారు. లంచం తీసుకుంటున్న దశలోనే ఎస్సైను అదుపులోకి తీసుకుని నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రసాయన పరీక్షలు నిర్వహించి ఆధారాలను



సేకరించారు.

ఈ ఘటనపై ఎస్సై దువ్వాల ఆంజనేయులుపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం నిందితుడిని నాంపల్లి ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరుపరిచినట్లు అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగులు అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా ఉద్యోగులు లంచాలు డిమాండ్ చేసినా లేదా అక్రమాలకు పాల్పడినా వెంటనే ఏసీబీకి సమాచారం అందించాలని అధికారులు ప్రజలకు సూచించారు. ఇందుకోసం టోల్ ఫ్రీ నంబర్ 1064తో పాటు వాట్సాప్ నంబర్ 9440446106 అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రజల సహకారంతో అవినీతిని నిర్మూలించేందుకు చర్యలు కొనసాగుతాయని ఏసీబీ పేర్కొంది.

# మార్కెట్ వద్ద ప్రమాదకర స్థితిలో విద్యుత్ వైర్లు

- **చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల విజ్ఞప్తి**

**వేలేరు, ఆగస్టు 20 (తెలంగాణ ముచ్చట్లు):**

వేలేరు మండలం పీచర గ్రామంలోని కూరగాయల మార్కెట్ వద్ద విద్యుత్ వైర్లు ప్రమాదకర స్థితిలో ఉండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ ప్రాంతంలో ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు, చిన్నారులు సంచరిస్తుండగా విద్యుత్ తీగలు మనుషుల చేతికి అందేంత తక్కువ ఎత్తులో ఉండటం ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని గ్రామస్తులు తెలిపారు.

ఇప్పటికే పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆరోపించారు. ఏదైనా ప్రమాదం జరిగేలోపు విద్యుత్ శాఖ అధికారులు స్పందించి



వైర్లను సురక్షితంగా ఏర్పాటు చేయాలని, ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌కు వచ్చే వ్యాపారులు, కొనుగోలుదారులు భయాందోళనల మధ్యనే అక్కడ సంచరిస్తున్నట్లు తెలిపారు.

# రూపా రెడ్డి హత్య ఘటనను ఖండిస్తూ శ్రీ గ్లోబల్ హైస్కూల్‌లో నిరసన

- **నల్ల బ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయులు, యాజమాన్యం నిరసన**

**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 20(తెలంగాణ ముచ్చట్లు )**

రూపా రెడ్డి హత్య ఘటనను ఖండిస్తూ నాగులవంచలోని శ్రీ గ్లోబల్ హైస్కూల్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల మేనేజ్‌మెంట్ సభ్యులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

విద్యార్థుల్లో మానవత్వం, విలువలు, క్రమశిక్షణ, అహింస, పరస్పర గౌరవం వంటి సద్గుణాలను పెంపొందించాల్సిన అవసరం ఉందని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. హింసకు విద్యా సంస్థల్లో ఎలాంటి స్థానం లేదని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ నిరసన కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ సభ్యులు ఈ. దివాకర్ రెడ్డి, వాహిని, తిరుపతి రెడ్డి, సుధాకర్ రెడ్డితో పాటు పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు. "హింసకు దూరంగా ఉండాలి – మానవతా విలువలను కాపాడాలి" అనే సందేశాన్ని ఈ సందర్భంగా అందించారు.




# రైల్వే సమస్యలపై గళమెత్తిన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి

- *** దక్షిణ మధ్య రైల్వే జీఎంతో కీలక సమీక్ష**
- *** ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలో పలు అంశాలపై చర్చ**
- *** భద్రాచలం రోడ్ స్టేషన్ పేరును కొత్తగూడెం లేదా భద్రాద్రి కొత్తగూడెంగా మార్చాలని వినతి**
- *** శ్రీరాముల వారు కొలువుదీరిన భద్రాచలం వరకు రైల్వే లైన్ ను పూర్తి చేయండి**

**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 20(తెలంగాణ ముచ్చట్లు )**



దక్షిణ మధ్య రైల్వే పరిధిలోనిపార్లమెంట్ సభ్యులతో రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ గురువారం సికింద్రాబాద్‌లోని రైలు నిలయంలో అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి హాజరై.. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలో పెండింగ్, ప్రస్తుతం కొనసాగుతున్న పలు కీలక రైల్వే ప్రాజెక్టుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు.

**సమస్యల పరిష్కారానికి పట్టు..**

సమావేశంలో ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ..ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రైల్వే రవాణా వ్యవస్థను మెరుగుపరచడం, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం తమ ప్రాధాన్యతని స్పష్టం చేశారు.

**భూ మార్పిడి - రోడ్ల అభివృద్ధి**

భద్రాచలం రోడ్డు (కొత్తగూడెం) రైల్వే స్టేషన్ అప్రోచ్ రోడ్డు విస్తరణ కోసం ఖమ్మం స్టేషన్ వద్ద ఉన్న రాష్ట్ర ప్రభుత్వ భూమిని మార్పిడి చేసుకునే ప్రక్రియపై దృష్టి సారించాలని కోరారు.

**కొత్త రైలు మార్గాలు**

ఖమ్మం అర్బన్, పాలేరు నియోజకవర్గాల్లోని సారవంతమైన భూముల గుండా కాకుండా, ప్రత్యామ్నాయ మార్గాల్లో డోర్నకల్ మిర్యాలగూడ రైల్వే లైన్ ప్రాజెక్టును చేపట్టాలని పునరుద్ఘాటించారు.

**స్టేషన్ల ఆధునీకరణ**

అమృత్ భారత్ పథకం కింద ఖమ్మం రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించి, పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కోవిడ్ కాలంలో నిలిచిపోయిన రైళ్లను పునరుద్ధరించాలని, తడికలపుడి, మధిర వంటి ప్రాంతాల్లో మరిన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్‌లు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

**భద్రాచలం రోడ్డు స్టేషన్ పేరును భద్రాద్రి కొత్తగూడెం లేదా కొత్తగూడెం స్టేషన్ గా మార్చండి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఖమ్మం నుంచి కొత్తగా ఏర్పడిన నేపథ్యంలో.. కొత్తగూడెం జిల్లా కేంద్రంలో భద్రాచలం రోడ్డు పేరిట కొనసాగుతున్న రైల్వే స్టేషన్ పేరును.. భద్రాద్రి కొత్తగూడెం స్టేషన్ లేదా కొత్తగూడెం రైల్వే స్టేషన్ గా మార్చాలని విజ్ఞప్తి చేశారు. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం ప్రసిద్ధ పుణ్యక్షేత్రమని అక్కడి వరకు రైల్వే లైన్ లేని నేపథ్యంలో..ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం నుంచి తిరుపతికి 'భద్రాద్రి ఎక్స్‌ప్రెస్'ను కొత్తగా ప్రవేశపెట్టాల్సిన ఆవశ్యకతను వివరించారు. శ్రీరామచంద్ర మూర్తి కొలువైన భద్రాచలం వరకు రైలు మార్గాన్ని వేసి,ఆ తర్వాత దానిని ఛత్తీస్ ఘడ్, ఒడిషా, మధ్య ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కూడలిగా రూపొందించాలని డిమాండ్ చేశారు.

**కారేపల్లి - గాంధీపురం ఆర్వోబీలు, అగ్రహారం అండర్‌పాస్‌లపై**

కారేపల్లి, గాంధీపురం ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఆర్వోబీలు, అగ్రహారం వద్ద అసంపూర్తిగా ఉన్న ఆండర్‌పాస్ పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు.

**ఖమ్మం నగరంలోని కస్బాబజార్ - గాంధీచౌక్ ప్రాంతంలో..**

వరద ముంపు సమస్యపై కూడా ప్రత్యేకంగా ప్రస్తావించిన ఎంపీ, డ్రైనేజీ వ్యవస్థను విస్తరించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో రైల్వే ప్రాజెక్టులన్నీ నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని రైల్వే జీఎంను ఎంపీ కోరారు.

# జాతీయ లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసులను పరిష్కరించేలా దృష్టి సారించాలి

- **పోలీస్ కమిషనర్ సునీల్ దత్**

**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 20(తెలంగాణ ముచ్చట్లు )**

సెప్టెంబర్ 12 న జాతీయ లోక్ అదాలత్‌ను దృష్టిలో ఉంచుకుని పోలీస్ స్టేషన్ల పరిధిలో పెండింగ్‌లో ఉన్న రాజీ పడదగిన కేసులను గుర్తించి, సంబంధిత పక్షాలతో సమన్వయం చేసుకుంటూ త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ అధికారులను ఆదేశించారు.

గురువారం పోలీస్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫిరెన్స్ లో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ...లోక్ అదాలత్ ద్వారా కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులతో పాటు రాజీకి అవకాశం ఉన్న కేసులను ఇరుపక్షాల సమ్మతితో స్నేహపూర్వకంగా పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

పోలీస్ అధికారులు తమ పరిధిలోని కేసులను సమీక్షించి, లోక్ అదాలత్‌కు పంపించేందుకు అర్హత ఉన్న కేసులను గుర్తించాలని సూచించారు. సంబంధిత ఫిర్యాదుదారులు, నిందితులు మరియు ఇతర పక్షాలకు లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

పెండింగ్ కేసుల పరిష్కారంలో న్యాయ సేవా సంస్థలతో సమన్వయం చేసుకుంటూ, నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పోలీస్ కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఏసీపీ మహేష్, నరసింహరావు, సిఐ సర్వయ్య పాల్గొన్నారు.




# సీఎం చంద్రబాబుకు జాతీయ వడ్డెర సంఘం కృతజ్ఞతలు

**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 20(తెలంగాణ ముచ్చట్లు )**

వడ్డెర సామాజిక వర్గానికి చెందిన రమాదేవికి ఎమ్మెల్సీ అవకాశం కల్పించినందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి జాతీయ వడ్డెర సంఘం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

ఖమ్మం జిల్లా జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు బత్తుల వీరబాబు అధ్యక్షతన, జాతీయ అధ్యక్షుడు పీట్ల శ్రీధర్, రాష్ట్ర అధ్యక్షుడు వల్లెపు శివకుమార్ ఆదేశాల మేరకు గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జాతీయ వడ్డెర సంఘం గౌరవ సలహాదారు దేరంగుల బ్రహ్మం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా దేరంగుల బ్రహ్మం మాట్లాడుతూ, వడ్డెర సామాజిక వర్గానికి చెందిన రమాదేవికి ఎమ్మెల్సీ అవకాశం కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వడ్డెరలతో పాటు బీసీ సామాజిక వర్గాల అభివృద్ధికి రాజకీయ




ప్రాతినిధ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. బీసీల హక్కుల పరిరక్షణకు సంఘటితంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

అనంతరం ఖమ్మంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఆవరణలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బహుజన మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు వడ్డెర, బీసీ సామాజిక వర్గాల హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని నాయకులు ప్రతిజ్ఞ చేశారు.

ఈ కార్యక్రమానికి జాతీయ వడ్డెర సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులతో పాటు బీసీ సంఘాల ప్రతినిధులు, టీడీపీ నాయకులు, వడ్డెర సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నర్ర ఎల్లయ్య, వల్లెపు సోమరాజు, బత్తుల గోపాలరావు, గోగుల ఆది, ఆలకుంట కొండలు, బత్తుల వెంకన్న, బత్తుల తిరుమలరావు, ఆలకుంట అంజయ్య తదితరులు పాల్గొన్నారు. జిల్లా నాయకులు వేముల వెంకట ప్రసాద్, చింతల వెంకన్న, వేముల ఉపేందర్, వేముల వెంకట్రావు, పెనుగొండ వెంకట్రావు, రాయల వెంకటేశ్వర్లు, రాయల సీతయ్య, తమ్మిశెట్టి వీర్రాజు, బత్తుల నాగేశ్వరరావు, బత్తుల గోపాల్, కొండలరావు, చల్లా పుల్లయ్య, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, అంజయ్య, విడగొట్టి హనుమంతు, కుంచపు కుమార్, కుంచపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. టీడీపీ జిల్లా నాయకులు కేతినేని హరీష్, ఓర్సు కృష్ణ, బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు డాక్టర్ కేవీ కృష్ణారావు, కత్తి నెహ్రూ గౌడ్, పెల్లూరు విజయ్ కుమార్ తదితరులు హాజరై సంఘీభావం తెలిపారు. జాతీయ వడ్డెర సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కుంచపు కుమార్‌తో పాటు జిల్లా కమిటీ సభ్యులు, బీసీ సంఘాల ప్రతినిధులు, వడ్డెర సంఘ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సమాజంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకం

- **జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి.**
- **వరంగల్ సెప్టెంబర్5న టీఎంజేఎఫ్ మూడవ రాష్ట్ర మహాసభల**
- **పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**ఆగస్టు 20,జగిత్యాల(తెలంగాణ ముచ్చట్లు):**

సమాజంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అల్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సెప్టెంబర్ 5న హనుమకొండలో జరిగే తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర మూడవ మహాసభల పోస్టర్ను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు బూరుగుల నాగేందర్ మాదిగ తో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. సమాజాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టుల సేవలను ఆయన ఈ సందర్భంగా కొనియాడారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకెళ్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎంజెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మైలారపు ప్రేమ్ కుమార్, బొల్లెపాక రాజేష్, రాష్ట్ర నాయకులు బోట్ల సదానందం, సిరిసిల్ల అనిల్ తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# కేసీఆర్ కోసం 300 కిలోమీటర్ల పాదయాత్ర

- **వాంకిడి నుంచి ఎర్రవెల్లి వరకు నడక**
- **అభిమానులను ఆప్యాయంగా కలిసిన కేసీఆర్**
- **మళ్లీ ప్రభుత్వం వస్తుందని ధీమా**

**ఎర్రవెల్లి, ఆగస్టు 20 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలనే ఆకాంక్షతో కుమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం నుంచి ఇద్దరు సామాన్య అభిమానులు సుమారు 300 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టి గురువారం ఎర్రవెల్లిలోని ఆయన నివాసానికి చేరుకున్నారు. తమ అభిమానాన్ని, అంకితభావాన్ని చాటుకుంటూ చేసిన ఈ యాత్ర స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. వాంకిడి మండలానికి చెందిన జాడే తిరుపతి అనే ఆటో డ్రైవర్, దుర్గం శంకర్ అనే హోటల్ కార్మికుడు ఈ పాదయాత్రను చేపట్టారు. కేసీఆర్ పట్ల ఉన్న అభిమానంతోనే ఈ యాత్ర ప్రారంభించామని, తమకు ఎలాంటి వ్యక్తిగత ప్రయోజనాలు లేదా వినతులు లేవని వారు తెలిపారు. తెలంగాణ అభివృద్ధి కోసం కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలనే సంకల్పంతోనే ఈ ప్రయాణం చేశామని పేర్కొన్నారు.


దాదాపు 11 రోజుల పాటు రోజుకు సగటున 25 కిలోమీటర్ల చొప్పున కాలినడకన ప్రయాణించి వారు ఎర్రవెల్లికి చేరుకున్నారు. మార్గమధ్యంలో ఎన్నో ఇబ్బందులు ఎదురైనా తమ లక్ష్యాన్ని వదలకుండా ముందుకు సాగినట్లు తెలిపారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి సహకారంతో వారికి కేసీఆర్‌ను కలిసే అవకాశం లభించినట్లు సమాచారం. ఎర్రవెల్లిలోని నివాసానికి చేరుకున్న అభిమానులను కేసీఆర్ సాదరంగా ఆహ్వానించారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని, ఇంత దూరం నడిచి వచ్చినందుకు అభినందించారు. ఎలాంటి స్వార్థం లేకుండా అభిమానంతో చేసిన ఈ పాదయాత్ర తమను కదిలించిందని, వారి అంకితభావాన్ని ప్రశంసించినట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి.

ఈ సందర్భంగా కేసీఆర్ వారితో కొంతసేపు మాట్లాడి వారి కుటుంబ పరిస్థితులు, జీవన విధానం గురించి తెలుసుకున్నారు. భవిష్యత్తులో ప్రజల ఆశీస్సులతో మళ్లీ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తప్పకుండా మళ్లీ వచ్చి కలవాలని వారికి సూచించినట్లు తెలిసింది. సమావేశం అనంతరం అభిమానులకు ప్రత్యేకంగా వాహన సౌకర్యం కల్పించి స్వగ్రామాలకు పంపించారు. తమ అభిమాన నేతను ప్రత్యక్షంగా కలుసుకోవడం జీవితంలో మరచిపోలేని అనుభవమని తిరుపతి, శంకర్ తెలిపారు. ఈ ఘటన బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపగా, సామాజిక మాధ్యమాల్లో కూడా విస్తృతంగా చర్చకు దారితీసింది.

# మైనర్ బాలికలను వేధిస్తున్న పోకిరీలకు పోలీసుల కౌన్సెలింగ్

**కాప్రా, ఆగస్టు 20, తెలంగాణ ముచ్చట్లు**





మహిళలు, యువతులు, మైనర్ బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్న పోకిరీలకు మల్కాజిగిరి పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు.

మల్కాజిగిరి పోలీసు కమిషనర్ బడుగుల సుమతి ఆధ్వర్యంలో కాప్రా సర్కిల్ పరిధిలోని ఏఎస్‌రావు నగర్ అణుపురం కమ్యూనిటీ హాలులో 'సంస్కార్ మెగా కౌన్సెలింగ్ సదస్సు' నిర్వహించారు.

మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్ పరిధిలో షీ టీమ్‌లకు పట్టుబడిన ఈవ్ టీజర్లు, యువకులు, పురుషులను కార్యక్రమానికి పిలిపించి వారికి అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా సీపీ సుమతి మాట్లాడుతూ.. తెలిసీ తెలియక మైనర్ విద్యార్థులతో పాటు యువకులు, కొందరు 50 సంవత్సరాలు దాటిన వారు కూడా ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్నారని తెలిపారు. మహిళలు, బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం క్షమించరాని నేరమని హెచ్చరించారు.

గత రెండు నెలల వ్యవధిలోనే 252 మందికి పైగా ఈవ్ టీజింగ్ చేస్తూ షీ టీమ్‌లకు పట్టుబడ్డారని సీపీ వెల్లడించారు. ఇకపై పద్ధతి మార్చుకోకుండా మహిళలు, యువతుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రతి ఒక్కరూ తమ ఇంట్లో ఉన్న తల్లి, అక్క, చెల్లిని గుర్తు చేసుకుని మహిళలను గౌరవించాలని సూచించారు. తమ ఆలోచనా విధానంలో మార్పు తెచ్చుకుని సమాజంలో ప్రతి మహిళతో మర్యాదగా ప్రవర్తించడమే 'సంస్కార్' కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని సీపీ సుమతి తెలిపారు.

సంస్కారవంతమైన ప్రవర్తనను అలవర్చుకుంటే భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకావని ఆమె సూచించారు ఈ కార్యక్రమంలో ఉప్పల్ డీసీపీ సురేష్‌కుమార్, పలువురు పోలీసు అధికారులు, మానసిక నిపుణులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం

- **మౌలిక సదుపాయాల విస్తరణకు చర్యలు**
- **బండి సంజయ్ ఆధ్వర్యంలో శంకుస్థాపనలు**
- **రోడ్లు, డ్రైనేజీలకు భారీ నిధులు**
- **ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి**

**కరీంనగర్, ఆగస్టు 20 (తెలంగాణ ముచ్చట్లు):**



కరీంనగర్ పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పాల్గొని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు. నగర అభివృద్ధిని వేగవంతం చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. 39వ డివిజన్ కోతిరాంపూర్ పరిధిలోని పోచమ్మవాడలో యూఐడీఎఫ్ నిధుల కింద రూ.90 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరిగింది. ఈ నిధులతో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి పైప్‌లైన్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. స్థానిక ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ఈ పనులు కీలకంగా నిలవనున్నాయి.

అదేవిధంగా 54వ డివిజన్‌లో యూఐడీఎఫ్ నిధుల ద్వారా రూ.50 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, వర్షపు నీటి పారుదల పైప్‌లైన్ పనులకు శ్రీకారం చుట్టారు. అలాగే మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.10 లక్షల వ్యయంతో ఆర్‌సీసీ డ్రైన్ పైప్‌లైన్ నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేశారు. ఈ పనులు పూర్తయితే స్థానికంగా పారిశుద్ధ్య, రవాణా సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. ఈ కార్యక్రమాల్లో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, కార్పొరేటర్లు మాసం గణేష్, గొట్టిముక్కల ఉమారాణి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. అభివృద్ధి పనులు నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టు సంస్థలకు సూచించారు.

కరీంనగర్ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగుతోందని బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర స్థాయిలో లభించే నిధులను సమర్థంగా వినియోగించి ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే తమ లక్ష్యమని, నగరాభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తామని బండి సంజయ్ కుమార్ అన్నారు. చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత ఆయా ప్రాంతాల ప్రజలకు మెరుగైన రహదారులు, పారుదల సదుపాయాలు, తాగునీటి వసతులు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు.



# సచివాలయం వద్ద రాజీవ్‌కు ఘన నివాళి

- **82వ జయంతి సందర్భంగా స్మరణ**
- **రాజీవ్ గాంధీ సేవలను కొనియాడిన నేతలు**
- **పుష్పగుచ్ఛాలతో నివాళులర్పణ**
- **డిజిటల్ భారత్‌కు పునాదులు వేసిన నాయకుడిగా ప్రశంసలు**

**హైదరాబాద్, ఆగస్టు 20 (తెలంగాణ ముచ్చట్లు):**

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 82వ జయంతి సందర్భంగా హైదరాబాద్ సచివాలయం ఎదురుగా ఘన నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పుష్పగుచ్ఛాలు సమర్పించి నాయకులు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు. దేశ అభివృద్ధికి, ఆధునిక భారత నిర్మాణానికి రాజీవ్ గాంధీ అందించిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్, లక్ష్మణ్ యాదవ్, రాపోలు జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయనకు నివాళులర్పించారు.

ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ దేశంలో సమాచార సాంకేతిక రంగ అభివృద్ధికి రాజీవ్ గాంధీ విశేష కృషి చేశారని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజలకు చేరువ చేయడంలో ఆయన తీసుకున్న నిర్ణయాలు భారతదేశాన్ని ఆధునిక దిశగా నడిపించాయని తెలిపారు. గ్రామీణాభివృద్ధి, యువత సాధికారత, స్థానిక సంస్థల బలోపేతం వంటి అంశాలకు రాజీవ్ గాంధీ ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారని నాయకులు గుర్తు చేశారు. భవిష్యత్ తరాల కోసం దూరదృష్టితో అనేక సంస్కరణలు చేపట్టిన నాయకుడిగా ఆయనను కొనియాడారు.

డిజిటల్ భారత్‌కు పునాదులు వేసిన నాయకుల్లో రాజీవ్ గాంధీ ఒకరని వక్తలు పేర్కొన్నారు. సమాచార విప్లవానికి ఆయన చేసిన కృషి దేశ అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలిచిందని అన్నారు. దేశ పురోగతిలో ఆయన పాత్ర చిరస్మరణీయమని అభిప్రాయపడ్డారు. జయంతి సందర్భంగా రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవకు అంకితమవ్వాలని నాయకులు పిలుపునిచ్చారు. దేశ నిర్మాణంలో యువత ముందుండాలని, అభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ జయంతికి ఘన నివాళులు

- **నిజామాబాద్‌లో విగ్రహానికి పూలమాలలు**
- **టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నివాళి**
- **కాంగ్రెస్ నాయకుల పాల్గొనడం**
- **రాజీవ్ సేవలను స్మరించిన నేతలు**

**నిజామాబాద్, ఆగస్టు 20 (తెలంగాణ ముచ్చట్లు):**



మాజీ ప్రధానమంత్రి, భారతరత్న రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా నిజామాబాద్ నగరంలోని రాజీవ్ చౌరస్తాలో ఉన్న ఆయన విగ్రహానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాజీవ్ గాంధీ దేశ అభివృద్ధికి అందించిన సేవలను ఈ సందర్భంగా నాయకులు స్మరించుకున్నారు. ఆధునిక భారత నిర్మాణంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. సాంకేతిక రంగం, సమాచార విప్లవానికి పునాదులు వేసిన నాయకుడిగా రాజీవ్ గాంధీని కొనియాడారు.

ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ దేశ యువతకు అవకాశాల కల్పనలో రాజీవ్ గాంధీ దూరదృష్టి కలిగిన నాయకుడని అన్నారు. దేశాన్ని ఆధునికీకరణ దిశగా నడిపించిన ఆయన ఆలోచనలు ఇప్పటికీ మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ నాయకులు కూడా రాజీవ్ గాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ప్రజాస్వామ్య బలోపేతం, గ్రామీణాభివృద్ధి, సాంకేతిక పురోగతికి ఆయన చేసిన కృషిని కొనియాడారు.

కార్యక్రమంలో పలువురు నాయకులు రాజీవ్ గాంధీ జీవిత విశేషాలను ప్రస్తావిస్తూ దేశ అభివృద్ధికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. యువత ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ నివాళి కార్యక్రమం గౌరవప్రద వాతావరణంలో సాగింది. కాంగ్రెస్ శ్రేణులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.

# విరమణ పొందిన ఐఏఎస్ అధికారుల సచివాలయ సందర్శన

- **కుటుంబ సభ్యులతో కలిసి పర్యటన**
- **తెలంగాణ తల్లి విగ్రహం వద్ద గ్రూప్ ఫొటో**
- **సచివాలయ నిర్మాణ విశేషాలపై ఆసక్తి**
- **పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్న అధికారులు**

**హైదరాబాద్, ఆగస్టు 20 (తెలంగాణ ముచ్చట్లు):**



రాష్ట్ర పరిపాలనలో కీలక బాధ్యతలు నిర్వహించి విరమణ పొందిన ఐఏఎస్ అధికారులు గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయాన్ని సందర్శించారు. సుమారు 50 మంది విరమణ పొందిన ఐఏఎస్ అధికారులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈ పర్యటనలో పాల్గొన్నారు. సచివాలయాన్ని సందర్శించిన అధికారులు అక్కడి నిర్మాణ వైభవం, ఆధునిక సౌకర్యాలను పరిశీలిస్తూ ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. తెలంగాణ రాష్ట్ర పరిపాలనకు ప్రతీకగా నిలిచిన సచివాలయ భవన సముదాయాన్ని సందర్శించిన అధికారులు వివిధ విభాగాల పనితీరును తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యాచరణ నిర్వహణకు కేంద్రబిందువుగా ఉన్న ఈ సచివాలయం నిర్మాణ శైలి, సాంకేతిక సదుపాయాలు తమను ఆకట్టుకున్నాయని పలువురు అభిప్రాయపడ్డారు. కుటుంబ సభ్యులకు కూడా సచివాలయ ప్రత్యేకతలను వివరిస్తూ వారు పర్యటించారు.

ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహం వద్ద విరమణ పొందిన ఐఏఎస్ అధికారులు, వారి కుటుంబ సభ్యులు కలిసి గ్రూప్ ఫొటో దిగారు. రాష్ట్ర ఆవిర్భావ స్ఫూర్తిని ప్రతిబింబించే తెలంగాణ తల్లి విగ్రహం ముందు అందరూ ఒకచోట చేరి జ్ఞాపకాలను పదిలపరుచుకున్నారు. ఈ దృశ్యం సందర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాష్ట్ర పరిపాలనలో తమ సేవా కాలాన్ని గుర్తుచేసుకుంటూ అధికారులు పరస్పరం అనుభవాలను పంచుకున్నారు. వివిధ కాలాల్లో పనిచేసిన అధికారులు ఒకే వేదికపై కలుసుకోవడంతో స్నేహపూర్వక వాతావరణం నెలకొంది. పరిపాలనా వ్యవస్థలో వచ్చిన మార్పులు, అభివృద్ధి అంశాలపై కూడా వారు చర్చించుకున్నారు.

విరమణ అనంతరం కూడా ప్రజా పరిపాలనపై ఆసక్తిని కొనసాగిస్తున్న అధికారులు రాష్ట్ర అభివృద్ధి పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పడిన తరువాత పరిపాలనా రంగంలో చోటుచేసుకున్న మార్పులను వారు ప్రశంసించారు. ఆధునిక సాంకేతికతతో కూడిన సచివాలయ నిర్మాణం రాష్ట్ర పురోగతికి ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ పర్యటన విరమణ పొందిన ఐఏఎస్ అధికారులకు పాత జ్ఞాపకాలను గుర్తు చేయడంతో పాటు ప్రస్తుత పరిపాలనా వ్యవస్థను దగ్గరగా చూసే అవకాశాన్ని కల్పించింది. కుటుంబ సభ్యులతో కలిసి నిర్వహించిన ఈ సందర్శన సంతోషకరమైన అనుభూతిని మిగిల్చిందని పలువురు అధికారులు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పరిపాలనలో తమ సేవలను అందించిన అధికారులు మరోసారి సచివాలయంలో కలుసుకోవడం విశేషంగా నిలిచింది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in